ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

NO
SMOKING
ALCOHOL
SAY NO TO DRUGS

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 66 గురువారం 19 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 66 Thursday 19 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

### తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో
# సత్తా చాటిన బీసీలు!

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతానికి పైగా సీట్లు గెలుచుకున్న బీసీలు
- రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థుల భారీ విజయం
- ఇది బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని బీసీ కమిషన్ హర్షం
- 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి కమిషన్ విజ్ఞప్తి
- ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది




**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు (బీసీలు) అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు మాత్రమే రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ వారు గెలుపొందడం విశేషం. ఈ ఫలితాలపై బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో - మిగతా 2 లో

### మంత్రి కాన్వాయ్‌పై దాడి కేసులో
# బాల్క సుమన్ అరెస్టు



- క్యాతనపల్లిలోని నివాసంలో సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్యకర్తలపై లాఠీఛార్జ్
- కాన్వాయ్‌పై దాడి కేసులో ఏ1గా బాల్క సుమన్

**వార్త సంధ్య, మంచిర్యాల, ఫిబ్రవరి 18 :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సుమన్‌ను అరెస్టు చేసే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. క్యాతనపల్లిలోని ఆయన నివాసంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం రామగుండం తరలించనున్నారు. వివేక్ కాన్వాయ్‌పై దాడికి సంబంధించి - మిగతా 2 లో

### కాంగ్రెస్ నేతలు
## వడ్డీతో సహా చెల్లించుకోవాల్సిందే



- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
- అధికార పార్టీకి కొందరుపోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార - మిగతా 2 లో

# భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్
- భారత్ ఒక గొప్ప సాంకేతిక పరివర్తన దశలో ఉందన్న సుందర్ పిచాయ్
- దేశ భవిష్యత్తును ఏఐ నిర్దేశించబోతోందని ఉద్ఘాటన
- ప్రధాని మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు
- గూగుల్ జెమినైకి భారత్ అతిపెద్ద మార్కెట్లలో ఒకటి అని వెల్లడి
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్



2 లో

# యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన రాష్ట్రపతి ముర్ము

- విశాఖ తీరంలో ఫ్లీట్ రివ్యూ
- ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము
- ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలు
- ప్రధానంగా ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్
- విశాఖ సాగర తీరంలోని అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష



2 లో

# అక్రిడేషన్ లేకపోతే జర్నలిస్ట్ కాదా?

- తెలంగాణలో జర్నలిస్టుల అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రభుత్వ విధానం
- జర్నలిజం అంటే అక్రిడేషన్ కార్డా? లేక సమాజానికి నిజం చెప్పే బాధ్యతా?
- ప్రభుత్వం పెద్ద పత్రికల చేతిలో కీలుబొమ్మగా మారిందా?

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 ( వార్త సంధ్య ) :**
ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది జర్నలిస్టులు తమలో తాము వేసుకుంటున్న ప్రశ్న ఇదే. “అక్రిడేషన్ లేకపోతే నేను జర్నలిస్ట్ కాదా?” అనే సందేహం ఇప్పుడు వ్యక్తిగత ఆవేదన కాదుడ ఇది ఒక వ్యవస్థాగత సమస్య. దాదాపుగా ప్రతి చిన్న, మధ్య తరహా పత్రికకు చెందిన ఎడిటర్, రిపోర్టర్, ఫోటోగ్రాఫర్ ఇదే బాధను అనుభవిస్తున్నాడు.ప్రభుత్వం తీసుకొచ్చిన అక్రిడేషన్ విధానం జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బదులు, వారి గొంతును మూయించే సాధనంగా మారిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఆర్ఎన్ఐ, పిఆర్జిఐ రిజిస్ట్రేషన్ ఉన్నా కూడా అక్రిడేషన్ ఇవ్వడంలో అడ్డంకులు పెట్టడం ఏమిటి? రిజిస్ట్రేషన్ చట్టబద్ధంగా ఉన్నప్పుడు, అక్రిడేషన్ ఇవ్వకపోవడం ఏ న్యాయసూత్రానికి సరిపోతుంది?ప్రభుత్వం ఒకవైపు “అక్రిడేషన్ ప్రామాణికం” అంటూ పాలసీ ప్రకటిస్తోంది. మరోవైపు అదే ప్రభుత్వం 18 నెలల్లో పూర్తవాల్సిన ఎంప్యానెల్‌మెంట్‌ను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టి చిన్న పత్రికలను ఆర్థికంగా, వృత్తిపరంగా కుంగదీస్తోంది. నిజాయితీ ప్రభుత్వమైతే 18 నెలలు దాటిన పత్రికలను ఎందుకు ఎంప్యానెల్ చేయడం లేదు? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు లేదు.

### చిన్న పత్రికలపై వివక్షడ పెద్ద పత్రికలకు అనుకూలత?

పెద్ద పత్రికలకు వేల సంఖ్యలో అక్రిడేషన్ కార్డులు ఇస్తున్న ప్రభుత్వం, అదే సమయంలో నూతనంగా ఆర్ఎన్ఐ కలిగిన చిన్న పత్రికల ఎడిటర్లకు ఒక్క స్టేట్ అక్రిడేషన్ మరియు జిల్లా అక్రిడేషన్ ఇవ్వడంలో ఎందుకు వెనకడుగు వేస్తోంది?
ఇది కేవలం విధానపరమైన లోపమా? లేక ఉద్దేశపూర్వక వివక్షనా?
వారపత్రికలు, మాస పత్రికలకు 18 నెలల అటెండెన్స్ ఉంటే అక్రిడేషన్ ఇస్తున్న ప్రభుత్వం, రోజూ పత్రిక ప్రింట్ తీసుకుంటూ, ఫీల్డ్‌లో పనిచేస్తున్న చిన్న పత్రికలను ఎందుకు పక్కన పెడుతోంది?
వార, మాస పత్రికల సర్క్యులేషన్ తక్కువైనా సరే అక్రిడేషన్ ఇస్తారుడ కానీ రెగ్యులర్‌గా న్యూస్ కవర్ చేస్తున్న చిన్న డైలీ పత్రికలకు మాత్రం “నియమాలు” గుర్తొస్తాయి!
ఇది న్యాయమా?
జర్నలిజంలో ప్రమాణం కేవలం సర్క్యులేషన్‌నా? లేక కంటెంట్, ప్రజా ప్రయోజనమా?
చిన్న పత్రికలు ప్రశ్నలు వేస్తాయి.
పెద్ద పత్రికలు ప్రభుత్వ ప్రకటనలను మోయగలవు.
అందుకేనా ఈ వివక్ష?

### అక్రిడేషన్ పాలసీ హక్కుల హననం


ప్రభుత్వం తీసుకొస్తున్న అక్రిడేషన్ పాలసీ జర్నలిస్టుల ఆశలను కాలరాస్తోందన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి.
ఈ పాలసీ ద్వారా ఎవరు జర్నలిస్టులు? ఎవరు కాదో ప్రభుత్వం నిర్ణయించాలనుకుంటుందా?
జర్నలిస్టు అనేది అక్రిడేషన్ కార్డు వల్ల పుట్టడు.
రిపోర్టింగ్ చేయడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికారులను ప్రశ్నించడం ద్వారా జర్నలిస్టు అవుతాడు.
అయితే, అక్రిడేషన్ లేకపోతే వార్త కవర్ చేయలేమా?
ప్రశ్న అడగలేమా?
ప్రజా సమస్యలపై రాస్తే అది నేరమా?
ఈ పాలసీ అమలులోకి వస్తే, చిన్న పత్రికలు పూర్తిగా నిర్వీర్యం అవుతాయి. ఇది పరోక్షంగా మీడియా స్వేచ్ఛపై దాడి చేసినట్టే. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛను ప్రభుత్వ పాలసీతో హరించవచ్చా?
తెలంగాణలో జర్నలిస్టులు ఇదే ప్రశ్నిస్తున్నారు.

### ఆంధ్రప్రదేశ్‌తో పోలిక తెలంగాణ ఎందుకు వెనుకబడింది?

పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఆర్ఎన్ఐ కలిగిన ప్రతి పత్రికకు కనీస అక్రిడేషన్ ఇస్తున్నారు. అక్కడ చిన్నా పెద్దా అనే తేడా లేదు.
అయితే తెలంగాణలో మాత్రం ఎందుకు ఇవ్వడం లేదు?
ఇది పరిపాలనా వైఫల్యమా?
లేదా విధానపరమైన నిర్లక్ష్యమా?
చిన్న పత్రికల ఎడిటర్ల మధ్య జరుగుతున్న చర్చల్లో ఒక మాట స్పష్టంగా వినిపిస్తోంది
ప్రభుత్వం పెద్ద పత్రికల చేతిలో కీలుబొమ్మగా మారిందా?
ఈ విమర్శలు యథేచ్ఛగా రావడం లేదు.
ప్రకటనల పంపిణీ, అక్రిడేషన్ విధానం, ఎంప్యానెల్‌మెంట్ ఆలస్యండ అన్నీ ఒకే దిశగా చూపిస్తున్నాయి.
ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఆరోపణలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది.
మీడియా అనేది ప్రభుత్వానికి మిత్రడు కాదు, శత్రువూ కాదుడ అది ప్రజల గొంతు. ఆ గొంతును నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది.

### పరిష్కారం ఏంటి? డిమాండ్లు స్పష్టం

చిన్న, మధ్య తరహా పత్రికల జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లు ఇవి:
ఆర్ఎన్ఐ / పీఆర్జే రిజిస్ట్రేషన్ ఉన్న ప్రతి పత్రికకు కనీస అక్రిడేషన్ ఇవ్వాలి.
18 నెలల ఎంప్యానెల్‌మెంట్ నిబంధనను సంవత్సరాలు తరబడి పెండింగ్ పెట్టకుండా




పారదర్శకంగా అమలు చేయాలి.
పెద్దచిన్న పత్రికల మధ్య వివక్షను పూర్తిగా తొలగించాలి.
అక్రిడేషన్ పాలసీని జర్నలిస్టు సంఘాలతో చర్చించి సవరణ చేయాలి.
మీడియా స్వేచ్ఛను హరించే ఏ విధానమైనా వెంటనే ఉపసంహరించాలి.
చివరగా ఒక ప్రశ్న
అక్రిడేషన్ లేకపోతే జర్నలిస్టు కాదా?
ఈ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.
ఎందుకంటే జర్నలిస్టుల గొంతు మూగబోతేడ రేపు ప్రజల గొంతు కూడా మూగబోతుంది.

సెగ్గెం కిరణ్ కుమార్
ఎడిటర్, వార్త సంధ్య
ప్రత్యేక కథనం

# సంపాదకీయం

## ఫ్రెంచ్ రణవిహంగాలు!



మరో నూటపద్నాలుగు రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేయాలన్న భారత ప్రభుత్వ నిర్ణయం, ప్రస్తుత వాతావరణంలో సముచితమైనది. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని కొనుగోళ్ళ మండలి (డీఏసీ) ఈ ప్రతిపాదనకు ఆమోదముద్రవేసిందంటే, పూర్వరంగం పూర్తిగా సిద్ధమైనట్టే. డీఏసీ ఆమోదం తెలిపిన మూడున్నర లక్షలకోట్ల విలువైన మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోళ్ళలో రఫేల్ యుద్ధ విమానాలతో పాటు క్షిపణులు, చిన్నస్థాయి నిఘా విమానాలు, యాంటీ ట్యాంక్ మైన్ల మరమ్మతులు ఇత్యాది ప్రతిపాదనలు ఉన్నాయి. రఫేల్‌కోసం ప్రత్యేకించి ఎంత ఖర్చుచేయబోతున్నారు? అన్నది ప్రభుత్వం చెప్పకపోవడంతో మూడులక్షలకోట్లనీ, కాదు, మూడున్నరలక్షలకోట్లనీ మీడియా లెక్కలు కడుతోంది. భారత్‌ఫ్రాన్స్ మధ్య బాగా బలపడిన బంధానికి ఈ యుద్ధవిమానాల కొనుగోలు నిర్ణయం నిదర్శనం. 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' కోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ నేటినుంచి జరపబోతున్న రెండురోజుల భారత పర్యటనలో వ్యవహారం ఖరారు కాబోతున్నదని అంటున్నారు. భారత రక్షణరంగంకోసం ఇంతటి భారీ కొనుగోళ్ళు చేయడం ఇటీవలికాలంలో జరగలేదు. 18 విమానాలు ఫ్రాన్స్‌లోనే తయారై నేరుగా భారత్ వచ్చివాలుతాయని, మిగతా 96 భారత్‌లోనే తయారవుతాయట. స్వదేశీ తయారీ ఇంతటి భారీగా ఉన్నది కనుక, మీడియా గతాన్ని కూడా ఓ మారు గుర్తుచేస్తోంది. 2016లో మోదీ సర్కారు ముప్పై ఆరు విమానాలకోసం ఒక కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, అందులో తొలివిడతగా ఐదు రఫేల్ విమానాలు ఆరేళ్ళక్రితం అమృత్‌సర్‌లో వాలిన సందర్భంలో దేశరక్షణను మించిన ఘనమైన కర్తవ్యం వేరొకటి లేదని ప్రధాని సంస్కృతంలో ట్వీట్ చేయడం సహా అనేక పరిణామాలను మీడియా నెమరువేసుకుంటోంది. 1990ల్లోనే అత్యుత్తమమైన మీడియం మల్టీరోల్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఎంఆర్‌సీఏ)కోసం ప్రపంచవ్యాప్తంగా సాగిన అన్వేషణ నుంచి 126 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు కోసం కాంట్రాక్టు కుదరడం, మోదీ ప్రభుత్వం దానిని రద్దుచేసి, ముప్పై ఆరు విమానాలను నేరుగా దిగుమతిచేసుకోవడానికి సిద్ధపడటం వరకూ అనేకం గుర్తుకువస్తున్నాయి. మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్‌ఎఫ్ఏ) కింద కుదరబోయే కొత్త ఒప్పందాన్ని గతానికి కొనసాగింపుగానే అనేకమంది రక్షణరంగనిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పటి ఒప్పందాన్ని మధ్యలో తుంచి, ఇంతకాలానికి మళ్ళీ అటే మళ్ళడం కంటే, దానినే యథాతథంగా కొనసాగించి, చిన్నచిన్న అతుకులతో, చర్యలతో ముందుకు తీసుకుపోయివుంటే ఇప్పటికంటే ఎక్కువ విమానాలే ప్రస్తుతం మనదగ్గర సిద్ధంగా ఉండేవనివారి అభిప్రాయం. 126 విమానాలలో, పద్దెనిమిది ఎగిరివచ్చిన స్థితిలో, మిగతా 108 పూర్తి లైసెన్సుతో దేశీ తయారీ కనుక సాంకేతికతల బదలాయింపు, పరిశ్రమలకూ ఉపాధికీ ఊతం ఈపాటికే దక్కేవని వారి వాదన. ఎన్డీయే ప్రభుత్వం పాత ఒప్పందాన్ని రద్దుచేసి, కొత్తది కుదుర్చుకున్నప్పుడు, ఒక్కోదానికీ 526కోట్లకు బదులు 1670కోట్లు చెల్లించారనీ, హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ స్థానంలోకి దివాలాతీసిన అనిల్ అంబానీని తెచ్చారని కాంగ్రెస్ నానాయాగీ చేసిన విషయం తెలిసిందే. అత్యాధునిక అస్త్రశస్త్రాలు పొట్టన నింపుకొని యుద్ధానికి సిద్ధంగా వాలబోతున్న విమానాలనే కొనుగోలు చేశాం కనుక ధర పెరిగిందని బీజేపీ ఆ ఆరోపణలను కొట్టివేసింది. భారీ అవినీతి జరిగిందంటూ 'చౌకీదార్ చోర్‌హై' అన్న నినాదాన్ని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాస్త్రంగానూ వాడింది. రాజీవ్‌గాంధీని రాజకీయంగా బోఫోర్స్ కుంభకోణం దెబ్బతీసినట్టుగా మోదీ తిరగరాసిన ఆ ఒప్పందాన్ని ప్రయోగించి ఆయన ప్రతిష్ఠ దిగజార్చవచ్చునని రాహుల్ అనుకొనివుంటారు. రఫేల్ సామర్థ్యాన్నీ, సమర్థతను ఎవరూ అనుమానించనక్కరలేదు, దాని కొనుగోలునూ ప్రశ్నించనక్కరలేదు. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో అది నిర్వహించిన పాత్ర, దానిని అప్రదిష్ఠపాల్జేసేందుకు పాకిస్థాన్, చైనాలు చేసిన కుట్రలు తెలిసినవే. పొరుగుదేశాలన్నీ పక్కలో బల్లెంలాగా తయారైన ఈ కీలకతరుణంలో ఇప్పటికే మన అమ్ములపొదిలో చేరిన రఫేల్ విమానాలకు తోడుగా మరిన్ని సిద్ధంకాబోతున్నాయన్న వార్త కచ్చితంగా ధైర్యాన్ని ఇస్తుంది.

# దద్దరిల్లిన శాసన మండలి



**మొదటిపేజీ తరువాయి** – తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మృతి చెందిన మాజీ ఎమ్మెల్సీలకు శాసన మండలి ప్రగాఢ సంతాపం తెలిపింది. వారి మృతితో శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది.

**వారికి సంతాపం తెలిపిన మండలి :** ఐదో రోజైన ఇవాళ సభ సమావేశం కాగానే సంతాప ప్రతిపాదనను సభాపతి స్థానం నుంచి మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ప్రతిపాదించారు. మాజీ ఎమ్మెల్సీలు ఐలాపురం వెంకయ్య, టి రత్నాభాయి చేసిన సేవలను కొనియాడారు. ప్రజల కోసం తమ జీవితాన్ని అర్పించారని కీర్తించారు. అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని శాసన మండలి కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సభలో సభ్యులంతా లేచి నిలబడి 2నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

**తీర్మానాన్ని తిరస్కరించిన మండలి ఛైర్మన్ :** అనంతరం ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి హెరిటేజ్ సంస్థ నెయ్యి సరఫరా చేస్తోన్న అంశంపై చర్చించాలంటూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు రమేశ్ యాదవ్, ఆర్.జె భరత్, సిపాయి సుబ్రమణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. తిరుమల కల్తీ లడ్డూపై చర్చించాలని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి ఇచ్చిన మరో వాయిదా తీర్మానాన్నీ తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. నిబంధనల ప్రకారం ప్రశ్నోత్తరాలను చేపట్టారు. సభా కార్యకలాపాలను నిలిపివేసి తాము ఇచ్చిన వాయిదా తీర్మానంపై సభలో చర్చించాలని వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనకు దిగారు. పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. వైఎస్సార్సీపీ సభ్యులు పట్టువీడకుండా ఆందోళన చేయడంతో సభను కాసేపు వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు.

**పోడియం వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు :** అనంతరం సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలు ముగిసినట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. తరువాత సభ్యులకు ప్రత్యేక అంశాల ప్రస్తావనకు అవకాశం ఇచ్చారు. దీన్ని కూడా వైఎస్సార్సీపీ సభ్యులు అడ్డుకున్నారు. పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఇందాపూర్ డెయిరీపై చర్చ జరపాల్సిందేనంటూ పట్టుబట్టారు.

**చర్చ లేకుండానే రేపటికి వాయిదా :** పోడియంను చుట్టుముట్టి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. సభ్యుల ఆందోళనతో శాసన మండలి సమావేశాలు రేపటికి వాయిదా వేస్తూ ఛైర్మన్ నిర్ణయం ప్రకటించారు. వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనతో ప్రశ్నోత్తరాలు, ప్రత్యేక ప్రస్తావన, బడ్జెట్ పై చర్చ లేకుండానే సభ కార్యకలాపాలు రేపటికి వాయిదా పడ్డాయి.

# యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన రాష్ట్రపతి ముర్ము

**మొదటిపేజీ తరువాయి** – విశాఖపట్నం : విశాఖ సాగర తీరంలోని అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష ప్రారంభమైంది. ప్రధానంగా ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశేష అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, తూర్పు నౌకా దళ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాలు పాల్గొన్నారు. నేవీ సిబ్బంది గౌరవ వందనాన్ని రాష్ట్రపతి ముర్ము స్వీకరించారు. అనంతరం ఐఎన్‌ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రయాణించారు. విశేషం ఏంటంటే ఈ కార్యక్రమంలో రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాల నుంచి వచ్చినటువంటి మొత్తం 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన మరో 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు ఒక 7 అంతర్జాతీయ యుద్ధనౌకలు సమీక్షలో పాల్గొనడం గమనార్హం. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా ఆర్కేబీచ్ ప్రధాన కేంద్రంగా సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిబంధనలు తప్పనిసరి: విశాఖ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అధికారులు అవకాశాన్ని కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. పలు బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరిగా ఉండి తీరాలి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించేందుకు విశాఖ సాగర తీరానికి స్థానికులు పోటెత్తారు. నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన ముర్ము: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష ప్రపంచ దేశాల మధ్య ఐక్యతకు, పరస్పర సహకారానికి అద్దం పట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష -2026లో పాల్గొన్న రాష్ట్రపతి భారత నౌకాదళం ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ సమర్థంగా పని చేస్తుందని రాష్ట్రపతి ముర్ము కితాబిచ్చారు. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా నిర్వహించిన 71 యుద్ధనౌకల పరేడ్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిలకించారు.

# భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

**మొదటిపేజీ తరువాయి** – ఢిల్లీ : భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని, అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో



ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవం తమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావి ంచారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనా త్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళుతున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి** – చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు. అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు. దేవుడంటే వైసీపీ సభ్యులకు భక్తిభావం లేదని... పాల సేకరణ కూడా లేని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారని అనిత మండిపడ్డారు. ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని అన్నారు. గతంలో పింక్ డైమండ్ పేరుతో సభా సమయాన్ని వృథా చేశారని... అధికారుల విచారణలో అసలు పింక్ డైమండే లేదని తేలిందని చెప్పారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకోవద్దని హెచ్చరించారు. వైసీపీ హయాంలో వారి పత్రికకు యాడ్స్ రూపంలో రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారని విమర్శించారు. మదనపల్లి చిన్నారి హత్య కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని... తప్పు చేశాడు కాబట్టే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

# నేను భారత్‌కు వస్తానో, రానో తెలియదు

**మొదటిపేజీ తరువాయి** – వెళ్లకుండా ఇంగ్లండ్, వేల్స్ కోర్టుల ఆంక్షలు ఉన్నాయని కోర్టుకు సమర్పించిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం గత వారం విజయ్ మాల్యా పిటిషన్‌పై విచారణ జరపడానికి నిరాకరించింది. తనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. అయితే మాల్యా భారత్‌కు రాకుండా ఈ పిటిషన్‌పై విచారణ జరపలేమని స్పష్టం చేసింది. మాల్యాకు భారత్‌కు తిరిగొచ్చే ఉద్దేశం ఉందా, లేదా? అని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో మాల్యా తన తరఫు న్యాయవాది ద్వారా బాంబే హైకోర్టులో తాజా స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. ఈ పిటిషన్ విచారణ జరిపేందుకు ఆయన ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ అమిత్ దేశాయ్ కోర్టులో వాదనలు వినిపించారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

**మొదటిపేజీ తరువాయి** – పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే స్పష్టమైన నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, 13న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ పేర్కొంది. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టులో కేసులు వేసిన వారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# మంత్రి కాన్వాయ్‌పై దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టు



**మొదటిపేజీ తరువాయి** – రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏ1గా బాల్క సుమన్, ఏ2గా మూల రాజిరెడ్డి పేర్లను పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ స్థానాలు వచ్చాయి. అయితే కుట్రపూరితంగా మున్సిపాలిటీని చేజిక్కిం చుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో ఈరోజు బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు కలిసి క్యాతనపల్లి బంద్ కు పిలుపునిచ్చాయి.

# భారత్ మరో కీలక అడుగు




**మొదటిపేజీ తరువాయి** – మేకిన్ ఇండియాలో భాగంగా ఇప్పటికే భారత్ పలు ఆయుధాలను సొంతంగా తయారు చేస్తోంది. రష్యా సమన్వయంతో శత్రు భయంకర బ్రహ్మోస్ క్షిపణులను ఇండియా తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్థాన్ బెంబేలెత్తిపోయింది. తాజాగా భారతో మరో ముందడుకు వేసింది. ఫ్రాన్స్ సహకారంతో భారత్ దేశీయంగా హ్యామర్ క్షిపణులను తయారు చేయనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ప్రధాని మోదీ మధ్య దీనిపై ఒప్పందం కుదిరింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఈ క్షిపణులను కూడా వాడింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న రఫేల్ యుద్ధ విమానాలకు హామర్ క్షిపణులను జోడించారు. తాజాగా మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు భారత రక్షణ శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. వీటికోసం అదనంగా హామర్ క్షిపణులు తయారు చేయాల్సి ఉంటుంది. స్వదేశీ తేజస్ యుద్ధ విమానాలకు కూడా ఈ క్షిపణులను జోడించనున్నారు. ఈ క్షిపణులను ఇండియాలోనే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ సంయుక్తంగా తయారు చేయనున్నాయి. మేకిన్ ఇండియా ప్రోగ్రామ్‌లో భాగంగా హెచ్125 హెలికాప్టర్లను కూడా స్వదేశీయంగా తయారు చేయనున్నారు. కర్నాటకలోని వేమగాల్‌లో అసెంబ్లింగ్ యూనిట్ ప్రారంభమైంది. వీటిని యూరోపియన్ సంస్థ ఎయిర్‌బస్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంయుక్తంగా తయారు చేస్తున్నాయి. ఇది లైట్ మల్టీరోల్ హెలికాప్టర్. మంచు పర్వతాల్లోనూ సత్తా చాటుతుంది. హిమాలయాల్లోని ఎవరెస్ట్ శిఖరం అంత ఎత్తు వరకు ఇది ఎగరగలదు.

# కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సిందే



**మొదటిపేజీ తరువాయి** – దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!

**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా శనగల కొనుగోళ్ల ప్రారంభం**

**94,500 మెట్రిక్ టన్నుల శనగల సేకరణకు నిర్ణయం**

**రైతు సేవా కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ**



కొనుగోలు చేసిన 15 రోజుల్లోనే రైతు ఖాతాల్లోకి నగదు జమ

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి శనగల కొనుగోలు ప్రక్రియను నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ధరల మద్దతు పథకం కింద మొత్తం 94,500 మెట్రిక్ టన్నుల శనగలను సేకరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు అందాయని, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతాయని వివరించారు. కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో సీఎం యాప్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఈ సేకరణను పర్యవేక్షిస్తాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్ వంటి అన్ని శాఖల సమన్వయంతో నేరుగా రైతు సేవా కేంద్రాల్లోనే కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకత కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేయగా, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన 15 రోజుల లోపే డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

## నిరంతర సాధన ద్వారానే విజయం సాధ్యం ప్రిన్సిపాల్ ఉష




**పెద్దపల్లి, మంథని ఫిబ్రవరి 18 (వార్త సంధ్య) :** విద్యార్థులు నిరంతర సాధన ద్వారానే విజయం సాధించడం సాధ్యం అవుతుందని ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)ఉష అన్నారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతూ వచ్చే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన కొనసాగుతుందన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్ లో విశాలమైన తరగతి గదులతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ అంబరీష్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఈ కళాశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చి ప్రయోజనం పొందాలన్నారు. ఏ ఐ కాలంలో మారుమూల ప్రాంతాల పిల్లలు వెనకపడకూడదు అనే ఉద్దేశంతో దాతల సహకారంతో ఈ కళాశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ సయ్యద్ సలీం మాట్లాడుతూ తాను ఇక్కడే పనిచేసి పదవీ విరమణ పొందానని, ఈ కళాశాల గుర్తులు ఎన్నడూ మరచిపోలేనివి అన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఝాన్సీ, శ్రీధర్ రావు, తిరుపతి, తిరుమల్, శశాంక్, నగేష్, శ్రీదేవి,ఎల్ఆర్ కే రెడ్డి, సబిత,మౌనిక,సురేష్, దీపారాణి, సిబ్బంది బియ్యబాని, రాజయ్య,అనసూయ, ప్రభాకర్ పాల్గొన్నారు.

## కోకో లైఫ్ ప్రాజెక్ట్ ఆఫ్రో-మోండలీజ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం







**ఏలూరు జిల్లా, పెదవేగి, ఫిబ్రవరి 18 (వార్త సంధ్య ):** కోకో లైఫ్ సామాజిక అభివృద్ధి కార్యక్రమములో భాగంగా మోండలీజ్ కంపెనీ వారి ఆర్థిక సహకారముతో బుధవారం ఆఫ్రో (యాక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్) సంస్థ ద్వారా గుడ్ సమరటిన్ కాన్సర్ హాస్పిటల్ ఏలూరు వారి సౌజన్యంతో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరంను స్థానిక ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, పెదకడిమి గ్రామములోని పాత గ్రామ పంచాయతీ ఆవరణములో నిర్వహించడం జరిగింది. ఈ ఆరోగ్య శిభిరమునకు పెదకడిమి మరియు పరిసర ప్రాంతాల నుండి లబ్ధిదారులు హాజరై జ్వరాలు, బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, మోకాళ్ళ నొప్పులు, చర్మ వ్యాధులు, స్త్రీల సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు వంటి వైద్య సేవలను వినియోగించుకోవడం జరిగింది. పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులను అందచేయడం జరిగింది. ఈ క్యాంపునకు గ్రామ సర్పంచ్ కే బలరాం చౌదరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్ పావని, ఏఎన్ఎం నిర్మల కుమారి, ఆశా వర్కర్లు కనకదుర్గ, ఆఫ్రో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పి.విజయ ప్రసాద్, ఏరియా ఫీల్డ్ ట్రైనర్లు – కే శివ, కే తేజ ప్రసన్న, బి జ్యోతి, గుడ్ సమర్థియన్ హాస్పిటల్ నుండి డా.జాకబ్, పిఆర్ఓ వినీల్ వారి సహాయక సిబ్బంది స్వప్న, జ్యోతి మరియు గ్రామస్థులు హాజరైనారు. భవిష్యత్తులో కోకో సాగుచేస్తున్న గ్రామాలలో మోండలీజ్ కంపెనీ వారి ఆర్థిక సహకారముతో మరిన్ని ఆరోగ్య శిబిరములను ఏర్పాటు చేస్తామని ఆఫ్రో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పి.విజయ ప్రసాద్ తెలియచేసారు .

## కొత్తగూడెం కార్పొరేషన్ విజయంతో సిపిఐ చారిత్రాత్మక ఘనత

**జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‘కు ఘన సన్మానం**

**శేషగిరి భవన్‌లో శాలువాలు, పూలమాలతో సత్కారం**

**ప్రజా ఆశయాల విజయమే ఈ ఫలితం కోరిమి రాజ్ కుమార్**




**కొత్తగూడెం కార్పొరేషన్ ఫిబ్రవరి 18(వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పొరేషన్‌కు తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో సిపిఐ 23 డివిజన్లతో పాటు మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మేయర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్‌ను, కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పర్యవేక్షణ, సూచనలతో పార్టీ అభ్యర్థుల గెలుపుకు నిరంతర కృషి చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషాను ఘనంగా సన్మానించారు. సిపిఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇద్దరికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కోరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక, ప్రజా వర్గాల విశ్వాసానికి ఇది నిదర్శనమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కొత్తగూడెం అభివృద్ధికి మేయర్, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ విజయం ప్రజా పోరాటాలకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ వి రమణ మూర్తి, బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారం కొరకు జి ఎం ను కలిసిన గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు



**కొత్తగూడెం/ సింగరేణి, ఫిబ్రవరి 18 వార్తా సంధ్య) :** కొత్తగూడెం ఏరియా లో పలు కార్మికుల సమస్యలు పరిష్కారం కొరకు ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు ను కలిసి చర్చించిన ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్. వీ కే ఓ సీ ఉపరితల గని లో ఉత్పత్తి ప్రారం భించి స్థానిక కార్మికుల తో ఖాళీలను సర్దుబాటు చేయాలని, ఏరియా వర్క్ షాప్ లో క్లర్క్ ల కొరత ఉన్న ందున కార్మికులకు రావలసిన ఇంక్రిమెంట్ లు , ప్రమోషన్ లు , పరిపాలన సంబంధిత పనులలో జాప్యం జరుగుతున్నదని కావున వెంటనే వర్క్ షాప్ లో క్లర్క్ ల ఖాళీలను నియమించాలని తెలిపారు. అదేవిధంగా కార్మికవాడ గౌతంపూర్ లోని స్విమ్మింగ్ పూల్ మెయింటెనెన్స్ మరియు స్విమ్మింగ్ కోచ్ కొరకు సిబ్బ ంది నీ కేటాయించాలని కోరారు,సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. సానుకూలంగా స్పం దించిన జిఎం త్వరితగతన సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం సీపీఐ పార్టీ నూత నంగా ఎన్నికైన 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీని జిఎం షాలెం రాజుకు పరిచయం చేసిన ఏఐటీ యూసీ నాయకులు నూతనంగా ఎన్నికైన కంచర్ల హిమాశ్రీకి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణ మూర్తి, బ్రాంచ్ సహాయ కార్య దర్శి గట్టయ్య, వైస్ ప్రెసిడెంట్ కతర్ల రాములు, బ్రాంచ్ ఆఫీస్ బేరర్ సందేబోయిన శ్రీనివాస్, పిట్ కార్య దర్శులు మధు కృష్ణ, సౌజన్య, సిపిఐ పార్టీ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జేములయ్య, సిపిఐ నాయ కులు పాటి మోహన్,మండల రాజు,కోటి,శివ సుదర్శన్,మన్నెంపల్లి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి రాజకీయాలపై అవగాహన ఉండాలి

**ఎజీఎస్ విద్యార్థులు అసెంబ్లీ సందర్శన సందర్భంగా పరిటాల సునీత**

**విద్యార్థులను ఆప్యాయంగా పలుకరించిన ఎమ్మెల్యే సునీత**



**వార్తా సంధ్య,ప్రతినిధి అనంతపురం :** విద్యార్థి దశ నుంచే రాజకీయాలు, కరెంట్ అఫైర్స్ మీద అవగాహన ఉండాలని విద్యార్థులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఏజీఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్ని వీక్షించారు. స్పీకర్ అనుమతితో వారు శాసనసభ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా ఎమ్మెల్యేలను ప్రత్యేకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాలు ఎలా ఉన్నాయి.. అక్కడ ఏమేమి తెలుసుకున్నారని విద్యార్థులనడిగి ఆరా తీశారు. ప్రతి ఒక్కరికి చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ముఖ్యంగా విలువలతో కూడిన రాజకీయాలు ఎలా ఉంటాయన్నది తెలుసుకోవాలన్నారు. రాజకీయాల్లో మంచి, చెడు రెండూ ఉంటాయని.. వాటిని గమనించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# బెల్టుషాపులను అరికట్టాలి, ప్రజారోగ్యాలను కాపాడాలి

**ప్రతి వైన్ దుకాణాలలో అన్ని రకాల బ్రాండ్లను అందుబాటులో ఉంచాలి**

**స్థానికులు వ్యతిరేకరించిన చోట బెల్ట్ షాపులు పెట్టొద్దు**

**సిండికేట్ దోపిడీని అరికట్టి, ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలి**

**ఎక్సైజ్ సూపరిండెంట్ కు వినతి పత్రం అందజేసిన సామాజిక సేవకులు కర్నె బాబురావు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 18 (వార్త సంధ్య) :** అశ్వాపురం మండలంలో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్టుషాపులు అరికట్టాలని, సిండికేట్ దోపిడీని నివారించాలని, ఎమ్మార్పీ ధరలకే మద్య విక్రయాలను జరపాలని, సామాజిక సేవకులు కర్నె బాబురావు అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషనరీ సూపరిండెంట్ జానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ, అశ్వాపురం మండల కేంద్రంలో వైన్ షాప్ నిర్వాహ కులు ప్రత్యక్షంగా బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఈ షాపులు జనావాసాల మధ్య స్కూళ్లు దేవాలయాలకు దగ్గర్లో జన సమర్థం ఉన్న ప్రాంతాల్లో పెడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాల్లో మహిళలు, స్థానిక ప్రజలు వీటిని ప్రతిఘటిస్తున్నారన్నారు. కొత్తగా షాపులు పొందిన వైన్ షాప్ నిర్వాహకులు అడ్డగోలు లాభార్జన కోసం ఇప్పటికే ఇబ్బడి ముబ్బ డిగా అనధికారికంగా బెల్టుషా పులతో ఒప్పందాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బెల్టుషాపుల వల్ల మద్యం వినియోగం పెరగడమే కాకుండా నియం త్రణలేని మద్యం అమ్మకాలు సాగుతాయ ని తెలిపారు. జనం అప్పుల పాలవుతున్నారని, మహిళలు వేధింపులకు గురవుతారని, అల్లరి మూకలు పెట్రేగిపోతాయని, అందువల్ల బెల్టుషాపులను ఎక్కడి కక్కడ కట్టడి చేయాలన్నారు. మండల కేంద్రంలోని వైన్ షాపుల రూటే సపరేటు అన్న చందంగా తయారైందనీ, సమయ పాలన పాటించకుండా షాపులను నిర్వహిస్తున్నారని, నౌకరినామ నిబంధనలు కూడా పాటించడం లేదన్నారు. మూడు వైన్ షాపుల నిర్వాహకులు సిండికేట్ గా మారి. మండలంలో ఉన్న గ్రామాలను షాపునకు ఏడు గ్రామాల చొప్పున లక్కీ డ్రా రూపంలో పంచుకోవడం మండల చర్చనీయాంశంగా మారిందన్నారు. ప్రతి షాప్ లో అన్ని రకాల బ్రాండ్ల మద్యాన్ని అందుబాటులో ఉంచాలని ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి వైన్ షాపులో ఆన్లైన్ పేమెంట్ సేవలను అందుబాటులో ఉంచాలన్నారు. బెల్ట్ షాపులను నియంత్రించాలని అందుకోసం ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వాటిపై కఠినంగా వ్యవహరించాలని ఎక్సైజ్ సూపరిండెంట్ కు వివరించారు. తాను చేసిన విజ్ఞప్తి పట్ల ఎక్సైజ్ అధికారు లు సానుకూలంగా స్పందించారని త్వరలోనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చి నట్లు ఆయన మీడియాకు తెలిపారు.

## ప్రతి పదో తరగతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కట్టుదిట్టమైన ప్రణాళిక

**విద్యార్థులందరిని సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలతో అనుసంధానం చేయాలి**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాలు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 18 (వార్త సంధ్య) :** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పదో తరగతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల పెంపు, పాఠశాలల్లో త్రాగునీటిమరుగుదొడ్ల సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై బుధవారం ఐడీఓసీ కార్యాలయం నుంచి జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఎంఈఓలు, ఏపీఎంలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి గత విద్యా సంవత్సరపు ఫలితాల విశ్లేషణలో గణితం, సైన్స్, తెలుగు విషయాల్లో విద్యార్థులు వెనుకబడినట్లు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ప్రీఫైనల్ పరీక్షల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను రెండు రోజుల్లో గుర్తించి వివరాలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. గ్రామ మహిళా సంఘాల ద్వారా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ సాయంత్రం స్టడీ అవర్స్‌పై వీఓఏల పర్యవేక్షణ ప్రత్యేక ప్రశ్నాపత్రాలు, డిజిటల్ పాఠ్యసామగ్రి అందజేత బాలుర హాజరు పెంపుపై ప్రత్యేక చర్యలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రోత్సాహం ప్రతి పదో తరగతి విద్యార్థిని సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలతో అనుసంధానం చేయాలని కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాల వివరాలతో కరపత్రాలు పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశించారు. పేద కుటుంబాల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో చేరి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ప్రవేశాలు పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాల మౌలిక వసతుల మెరుగుదల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సదుపాయం ఉండేలా చూడాలని, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసి మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు.

**పరీక్షల ప్రారంభానికి ముందే:**

అన్ని పాఠశాలల్లో త్రాగునీటి సదుపాయం బాలికల మరుగుదొడ్లు తప్పనిసరి అవసరమైన నివేదికలు సమర్పణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ జిల్లా వ్యాప్తంగా 30 ఏళ్ల లోపు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణుల వివరాలు సేకరించి ఉపాధి సమాచారంతో సమగ్ర నివేదిక రూపొందించాలని వీఓఏలకు సూచించారు. నిరుద్యోగ యువతను గుర్తించి నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, విద్యాశాఖ కోఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ‘ఇన్ఫినిటీ భరోసా...

**-ప్రతిభా పురస్కారాల ప్రకటన విడుదల !.**

**-జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఐ.ఏ.యస్ ,**

**జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు,**

**- ఎపిసి శైలజ వారి చేతుల మీదుగా పోస్టర్లు ఆవిష్కరణ చేయించిన ట్రస్ట్ సభ్యులు. ..**




**వార్త సంధ్య ప్రతినిధి కళ్యాణదుర్గం :** గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోని దాగిన ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా కళ్యాణ దుర్గం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఒక అద్భుతమైన అవకాశాన్ని ముందుకు తెచ్చింది.ఈ క్రమంలోనే ఆ ట్రస్ట్ ఫౌండర్,యం, బద్దే నాయక్ ఆధ్వర్యంలో పదవ తరగతి యస్,యస్,సి, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ‘ప్రతిభా పురస్కారాలను‘ ప్రకటించారు. బుధవారం ప్రతిభా పురస్కారాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఐ.ఏ.యస్ , జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రసాద్ బాబు వారు, ఎపిసి, శైలజ చేతుల మీదుగా ట్రస్ట్ సభ్యులుతో కలిసి ఆవిష్కరణ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, సేవ జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత, బద్దె నాయక్ తెలిపిన ప్రోత్సాహక బహుమతుల వివరాలుఇలా.

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ క్రింది విధంగా నగదు పురస్కారాలను అందజేయనున్నారు:**

ప్రథమ బహుమతిని రూ,10,000లునుద్వితీయ బహుమతిని రూ,7,000లును తృతీయ బహుమతి రూ, 5,000లును ఎంపిక విధానం మరియు అర్హతలు ఈ పురస్కారాలను రెండు విభాగాల్లో అందజేస్తారని పేర్కొన్నారు.ఈ నేపధ్యంలో మండల స్థాయిలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఈ విభాగం కేటాయించబడిందని తెలిపారు. యస్,యస్,సి, పరీక్షల్లో మండల స్థాయిలో టాప్ 3లో నిలిచిన వారు దీనికి అర్హులని చెప్పారు. డివిజన్ స్థాయిలోను ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరినీ కలిపి, డివిజన్ స్థాయిలో టాప్ 3లో నిలిచిన విజేతలకు ఈ పురస్కారాలు లభిస్తాయని వివరించారు.

**ముఖ్య గమనిక :**

మండల స్థాయి పురస్కారాలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే వర్తిస్తాయిన్నారు. అదనపు ఆకర్షణ , విజ్ఞాన యాత్ర! కేవలం నగదు బహుమతులే కాకుండా, ప్రతిభ చాటిన 18 మంది విద్యార్థులను ఐసిటి ట్రస్ట్ ప్రత్యేకంగా శ్రీహరికోట లేదా ,బెంగళూరులోని ఐ,యస్ఆర్,ఓ, కేంద్రానికి విజ్ఞాన యాత్రకు తీసుకువెళుతుందని అన్నారు. ఇది విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని పెంచేందుకు గొప్ప అవకాశమని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు., తమ ప్రతిభతో నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,యం, బద్యే నాయక్ సభ్యులు ఆకాంక్షించారు.

# శాసనసభ్యులు అమిలినేని చొరవతో...

**-మారుమూల గ్రామాలకు మహర్దశ!.**

**-ఎన్నికల హామీని నెరవేర్చిన శాసనసభ్యులు అమిలినేని.**

**అమిలినేనికి కృతజ్ఞతలు తెలిపిన, ఏల్లచింత టీడీపి నాయకులు!.**



**కుందుర్పి, వార్త సంధ్య ప్రతినిధి :** శాసనసభ్యులు , అమిలినేని సురేంద్రబాబు వారి చొరవతో మారుమూల గ్రామీణ ప్రాంతాలకు మహార్దశ కల్పించారని బుధవారం ఏళ్ళ చింత గ్రామ టిడిపి నాయకులు పేర్కొన్నారు. టిడిపి నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ. కాలినడకన కూడా నడవడానికి వీలు లేకుండా మారుమూల గ్రామాల్లో బండి జాడలుగా మారిన రహదారులను గుర్తించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, ఇక్కడి రహదారుల వాస్తవ పరిస్థితులను సంబంధిత ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి, ఈ ప్రాంత రహదారుల అభివృద్ధికి శాసనసభ్యులు, అమిలినేని సురేంద్ర బాబు , ఎనలేని కృషి చేస్తున్నారు చెప్పారు. గత ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థిగా ప్రచారానికి ఏళ్లచింత గ్రామానికి వచ్చిన సందర్భంగా, స్థానిక రహదారులను ఆయన పరిశీలించారు బాధపడ్డారుని వివరించారు. గ్రామంలోని రహదారుల నిర్మాణాలు చేపడతానని ఎన్నికల హామి ఇచ్చారు. ఈ మేరకు ఏళ్ళచింత గ్రామం, నుండి అల్లాపురం గ్రామం వరకు సుమారు 2 కిలో మీటర్ల దూరం గల రహదారికి గాను, రూ,2 కోట్ల నిధులను ఆయన మంజూరు చేయించారుని పేర్కొన్నారు. స్థానిక యం,ఎల్,ఏ సూచనల మేరకు కాంట్రాక్టర్ ఆ గ్రామ రోడ్డు నిర్మాణపు పనులు ఎట్టకేలకు బుధవారం ప్రారంభించారు. ఏల్లచింత గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రోడ్డు పనులు వద్దకు వెళ్లి, ఎన్నికల హామీను నెరవేర్చిన యం,ఎల్,ఏ, వారికి కృతజ్ఞత తెలిపి,హర్షం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు శ్రీనివాసులు,రామాంజినేయులు, బండ్ల శ్రీనప్ప, వడ్డే సన్నతిమ్మప్ప,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో పిచ్చి మొక్కల తొలగింపు




**టేకులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 18 (వార్త సంధ్య):** టేకులపల్లి గ్రామ పంచాయతీ ఆరో వార్డులోని మూడు తండ పీర్ల చావడి వెనక భాగం లో, నాలుగో వార్డ్ లో సిసి రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కల చెట్లను తొలగించడం జరిగింది గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది కృషి వల్ల రోడ్లు సుందరంగా మారుతున్నాయి. ప్రజలు కూడా సహకరించి, గ్రామ అభివృద్ధికి దోహదపడాలి అని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి కోరారు. రోడ్డుపై వెళ్లే బాటసారిలు గ్రామస్తులు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా మూడు బిచ్చు గ్రామ పంచాయతీ సిబ్బంది, నాను, ప్రసాద్, నదీమ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా బబ్బూరు పృథ్వీ గౌడ్



**ఎల్బీనగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 18 ( వార్త సంధ్య ) :** కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా బబ్బూరు పృధ్వి గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం. రాజీవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బబ్బూరు పృథ్వీ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్నారని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వైద్యులు, ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించేందుకు డాక్టర్స్ సెల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తనను జిల్లా చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కు, అలాగే రాష్ట్ర డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ ఎం. రాజీవ్‌కు బబ్బూరు పృథ్వీ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మొబైల్ డిస్పాచింగ్ యూనిట్ లబ్ధిదారుల ఆవేదన

### రోడ్డుపై కొబ్బరి బోండాలతో జీవనాధారం.




**కృష్ణాజిల్లా బ్యూరో, ఫిబ్రవరి 18, ( వార్త సంధ్య ):** జిల్లా పరిధిలోని ,జగ్గయ్య పేటలో కోదాడ రోడ్డు కోర్టు సమీపంలో మొబైల్ డిస్పాచింగ్ యూనిట్ లబ్ధిదారుడు తన వాహనంలో కొబ్బరి బోండాలు అమ్ము కుంటూ జీవనం సాగిస్తు న్నాడు, గత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రచారంతో ప్రారంభించిన మొబైల్ డిస్పాచింగ్ యూనిట్ పథకం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. స్వయం ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి వాహనాలు అందజేసిన లబ్ధిదారులు, సరైన మార్గదర్శకాలు మరియు వ్యాపార మద్దతు లేకపోవడంతో రోడ్డున పడి కొబ్బరి బోండాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు.పథకం ప్రారంభ సమయంలో గత ప్రభుత్వం "ఆర్థిక స్వావలంబన" లక్ష్యంగా వేలాది మందికి వాహనాలు అందజేసిందని ప్రకటించింది. అయితే లబ్ధిదారుల వాదన ప్రకారం, వాహనాలు ఇచ్చిన తర్వాత నాలుగు సంవత్సరాలు వాటి మీద జీవనం సాగించిన వాహనదారులు ప్రస్తుత ప్రభుత్వంలో అనుకోకుండా వారిని తొలగించడం వలన వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.దీని ఫలితంగా వాహనాలను ఇతర చిన్న వ్యాపారాలకు ఉపయోగించక తప్పలేదని చెబుతున్నారు. ఒక లబ్ధిదారు మాట్లాడుతూ, "గత ప్రభుత్వం ఇచ్చిన వాహనంతో స్థిరమైన ఆదాయం వస్తుందని నమ్మాం. కానీ ప్రస్తుత ప్రభుత్వం సరుకుల సరఫరా లేక, ఎవరూ పట్టించుకోకపోవడంతో చివరకు కొబ్బరి బోండాలు పెట్టుకుని అమ్ముకోవాల్సి వచ్చింది" అని ఆవేదన వ్యక్తం చేశారు.మొత్తానికి, స్వయం ఉపాధి పేరుతో ప్రారంభమైన ఈ పథకం నిజంగా లబ్ధిదారుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందా ? లేక ప్రచారపరమైన చర్యగానే మిగిలిపోయిందా ? అనే ప్రశ్నలకు సమాధానం కోసం ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## అల్లీపూర్ లో వైభవంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి జాతర.



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 18(వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి జాతర మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ వేడుకకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.పురోహితులు అంగడి భువనేశ్వర్, విక్రమ్ ఆధ్వర్యంలో వీరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయంలో నాయకులు



ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పురవీధుల గుండా రథాన్ని లాగుతూ భక్తులు 'ఓం నమశ్శివాయ' అనే నామస్మరణతో అల్లీపూర్ మారుమోగింది. మహిళలు మంగళ హారతులతో రథానికి స్వాగతం పలికి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ రాజరాజేశ్వర స్వామి అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాయికల్ ప్రజా ప్రతినిధులు శ్రీధర్,నాగరాజు, శేఖర్, అల్లీపూర్ గ్రామ కార్యదర్శి శేఖర్, గ్రామ సర్పంచ్ ఎంబారీ గౌతమి వెంకటేష్, ఉప సర్పంచ్ గురులింగు వినయ్ కుమార్, ఆలయ అనువంశికులు నామని శేఖర్, లక్ష్మి నర్సయ్య సుమన్, 8వ వార్డ్ మెంబర్ అనుమల్ల రాజ్ కుమార్, వార్డు మెంబర్లు పరశురాం, ప్రశాంత్, సాయికుమార్ , చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు మోఖీద్, సాగర్ రావు స్పందన, వేణు, అన్నదాన ట్రస్ట్ దాసారపు వేణు రావు, చిట్యాల భూమయ్య, బాలె చంద్రశేఖర్, సంజీవ్, గంగ శేఖర్ పొట్టవత్తిని నాగభూషణం, అనుమల్ల మల్లేశం, బండారి ముత్తయ్య, కారోబార్ రాజేందర్, మరియు గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడపడం: జైలు శిక్ష ఖాయం

### డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తికి జరిమానా, రెండు రోజులు జైలు శిక్ష



**టేకులపల్లి, ప్రతినిధి న్యూస్ ఫిబ్రవరి 18 (వార్త సంధ్య): టేకులపల్లి:** మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో టేకులపల్లి మండల లచ్చ తండా గ్రామానికి చెందిన భూక్య బాలాజీకి ఇల్లందు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి. ఇంద్ర రెండు రోజుల సాధారణ జైలు శిక్ష, 500 రూపాయలు జరిమానా విధించినట్లు టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడుపుతున్న దాస్ తండా పంచాయితీ లచ్చ తండా గ్రామానికి చెందిన భూక్య బాలాజీని తనిఖీల్లో భాగంగా పట్టుకుని బ్రీత్ అనలైజర్తో తనిఖీ చేయగా.. మద్యం సేవించి ఉన్నాడని రిపోర్టు రాగా అతడిని ఇల్లందు స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.ఇల్లందు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి. ఇంద్ర రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించడం జరిగింది అని ఎస్ఐ ఆలకుంట రాజేందర్ తెలిపారు.వాహనదారులు ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దు.డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు పడే ఆస్కారం కూడా ఉందని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## వనస్థలిపురం లో మహిళ దారుణ హత్య



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 18:** వనస్థలిపురం పోలీస్ వారు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు బుద్ధార్తి సునీత, వయస్సు 30 సంవత్సరాలు కి 2022 సంవత్సరంలో నేరస్థుడు దేవరకొండ మహేష్ తండ్రి: రమేష్, వయస్సు :30 సంవత్సరాలుతో వివాహం అయినది. తరువాత వారి మధ్య గొడవల కారణంగా 2024 సంవత్సరంలో విడాకులు తీసుకున్నారు. తదుపరి మృతురాలు 2025-ఏప్రిల్ నెలలో శ్రీనాథ్ ని వివాహం చేసుకొని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రీన్ సిటీ కాలనీ, కప్పల చెరువు దగ్గర్లో ఒక అపార్ట్మెంట్ నందు నివాసం ఉంటున్నారు. మృతురాలు రెండో పెండ్లి చేసుకున్నదని కోపంతో నేరస్థుడు గత నెల నుండి రెక్కి నిర్వహించి పథకం ప్రకారం తేది:18.02.2026 నాడు ఉదయం 11:30 గంటల సమయములో మృతురాలి ఇంటికి వెళ్ళి కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి చంపినాడు. ఇట్టి విషయములో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టి. మహేష్, ఇన్స్పెక్టర్ తెలియజేసినారు.

## మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు ఊతం కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు

### స్వయం ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎంపీ కేశినేని శివనాథ్

### ఎన్.ఐ.ఆర్.డి లో 7 విభాగాల్లో శిక్షణ పొందిన మహిళలతో ఎంపీ కేశినేని శివనాథ్ సమావేశం



**కృష్ణాజిల్లా బ్యూరో, ఫిబ్రవరి 18, వార్తసంధ్య విజయవాడ:** స్వయం ఉపాధి కోసం కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధితో పారిశ్రామిక వేత్తలుగా మారి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో కామన్ ఫెసిలిటీ సెంటర్లు (జఖీజం) ఏర్పాటు చేయనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. అలాగే మార్కెటింగ్ పరంగా కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ మిల్లెట్స్, గార్మెంట్స్ అండ్ లెదర్, నాచురల్ ఫార్మింగ్ , తేనె తయారీ, జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ పై శిక్షణ పొందిన ఏడు గ్రూపుల మహిళలతో గ్రూపుల వారీ గా విడివిడిగా సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా పిడి డి.ఆర్.డి.ఎ నాంచారయ్య కూడా పాల్గొన్నారు. మహిళలు తాము తయారు చేసిన వస్తువులను ఎంపీ కేశినేని శివనాథ్ కి చూపించారు. ఆ వస్తువుల నాణ్యత, భద్రత ల కోసం తీసుకున్న జాగ్రత్తల గురించి ఎంపీ కేశినేని శివనాథ్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలు తమకి రా మెటీరియల్ కొనుగోలు విషయంలో, మార్కెటింగ్ పరంగా, అధిక సంఖ్యలో వస్తువుల ఉత్పత్తికి తయారీ కోసం మెషినరీ పరంగా సహకారం అందించాలని ఎంపీ కేశినేని శివనాథ్ ను కోరారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ శిక్షణ పొంది వస్తువులు తయారు చేస్తున్న మహిళలకు మరింతగా ప్రోత్సహకం అందించే విధంగా తాము చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. . ఒకే రకమైన వస్తువులు తయారు చేసే వారందరికీ ఉపయోగపడే విధంగా కామన్ పెసిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ను ఏర్పాటు చేయటానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ కల్పించే విధంగా..వారు ఆర్థికంగా మరింత ఉన్నత స్థానంలో వుండే విధంగా కావాల్సిన సహాయ సహకారాలు అందించటానికైనా ముందు వుంటామని తెలిపారు. ఇంటి ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాన్ని స్పూర్తిగా తీసుకుని మహిళలను ఎంటర్ ప్రెన్యూర్స్ గా తీర్చిదిద్దేందుకు కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్.ఐ.ఆర్.డి లో పలు విభాగాల్లో శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు.అనంతరం ఎన్టీఆర్ జిల్లా పిడి డి.ఆర్.డి.ఎ నాంచారయ్య మాట్లాడుతూ మిల్లెట్స్, గార్మెంట్స్ అండ్ లెదర్, నాచురల్ ఫార్మింగ్ , తేనె తయారీ, జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ హెర్బల్ ప్రొడక్ట్స్ గ్రూపులకు నాణ్యమైన రా మెటీరియల్ ఎక్కడ దొరుకుతుందనే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే వస్తువుల తయారీ చేసే క్రమంలో, వాటిని మార్కెటింగ్ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ అందించే సహాయంతో పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి రూరల్ కో ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ, న్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా సమైక్య అధ్యక్షురాలు కందుల కల్పన, విజయవాడ రూరల్ సమైక్య అధ్యక్షురాలు సుహాసిని లతో పాటు తదితరులు పాల్గొన్నారు

## కుష్టు వ్యాధి నిర్మూలనకు హక్కుల ఆధారిత సమగ్ర దృక్పథం అవసరం


### రంగారెడ్డి జిల్లాలో ఎన్‌హెచ్‌ఆర్‌సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 ( వార్త సంధ్య ) :** కుష్టు వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు మెరుగైన వైద్యం అందించటమే ప్రధాన లక్ష్యమని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సి) లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్త కుమార్ నాయక్ స్పష్టం చేశారు.దతెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రంగారెడ్డి జిల్లాకు విచ్చేసిన ఆయనకు సమీకృత జిల్లా కార్యాలయాల ముదాయ భవనంలో అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. లలితా దేవి, అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. పాపారావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ప్రదీప్తా కుమార్ నాయక్, అదనపు జిల్లా కలెక్టర్ కె. శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న కుష్టు వ్యాధి నియంత్రణ చర్యలు, అలాగే వ్యాధి బారిన పడిన వ్యక్తుల మానవ హక్కుల పరిరక్షణ అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. సమావేశంలో మాట్లాడుతూ ఆయన, కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయగలిగిన వ్యాధి అని సమయానికి మెరుగైన ఔషధ చికిత్స (ఎన్డిటి) అందిస్తే సంపూర్ణ నివారణ సాధ్యమని ఆలస్యంగా గుర్తిస్తే శాశ్వత వికలాంగతకు దారితీయవచ్చని తెలిపారు. కుష్టు వ్యాధిని కేవలం వైద్య సమస్యగానే కాకుండా, అపోహలు, సామాజిక వివక్షతో ముడిపడిన సామాజిక సమస్యగా కూడా పరిగణించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపు, తొందరగా గుర్తింపు, ఆరోగ్య సేవలకు సులభ ప్రాప్తి, సామాజిక భద్రతా పథకాలు, విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాలతో హక్కుల ఆధారిత సమగ్ర దృక్పథం అవలంబించాలని అన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా లెప్రసీ బాధితులకు అందుతున్న వసతులపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి కుష్టు నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను శాఖల వారీగా సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం సాధ్యమని, బాధితులకు అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా మానవత్వంతో పనిచేయాలని ప్రదీప్తా కుమార్ నాయక్ సూచించారు. కుష్టు వ్యాధి కార్యక్రమం జాయింట్ డైరెక్టర్ డా. జాన్ బాబు వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, చికిత్స, నియంత్రణలో ప్రతి ఒక్కరి పాత్రను సమగ్రంగా వివరించారు. చివరగా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. పాపారావు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, జిల్లా ప్రాజెక్ట్ అధికారి డా. అంబికా, ఇబ్రహీంపట్నం ఉప జిల్లా వైద్య అధికారి డా. లక్ష్మి ప్రసన్న, జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ లేకపోతే జర్నలిస్ట్ కాదా?




**హైదరాబాద్, ఫిబ్రవరి 18 ( వార్త సమయం ) :** తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది జర్నలిస్టులు తమలో తాము వేసుకుంటున్న ప్రశ్న ఇదే. "అక్రిడేషన్ లేకపోతే నేను జర్నలిస్ట్ కాదా?" అనే సందేహం ఇప్పుడు వ్యక్తిగత ఆవేదన కాదుడ ఇది ఒక వ్యవస్థాగత సమస్య. దాదాపుగా ప్రతి చిన్న, మధ్య తరహా పత్రికకు చెందిన ఎడిటర్, రిపోర్టర్, ఫోటోగ్రాఫర్ ఇదే బాధను అనుభవిస్తున్నాడు. ప్రభుత్వం తీసుకొచ్చిన అక్రిడేషన్ విధానం జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బదులు, వారి గొంతును మూయించే సాధనంగా మారిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆర్ఎన్ఐ , పి ఆర్ జి ఐ రిజిస్ట్రేషన్ ఉన్నా కూడా అక్రిడేషన్ ఇవ్వడంలో అడ్డంకులు పెట్టడం ఏమిటి? రిజిస్ట్రేషన్ చట్టబద్ధంగా ఉన్నప్పుడు, అక్రిడేషన్ ఇవ్వకపోవడం ఏ న్యాయసూత్రానికి సరిపోతుంది? ప్రభుత్వం ఒకవైపు "అక్రిడేషన్ ప్రామాణికం" అంటూ పాలసీ ప్రకటిస్తోంది. మరోవైపు అదే ప్రభుత్వం 18 నెలల్లో పూర్తవాల్సిన ఎంప్యానెల్‌మెంట్‌ను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టి చిన్న పత్రికలను ఆర్థికంగా, వృత్తిపరంగా కుంగదీస్తోంది. నిజాయితీ ప్రభుత్వమైతే 18 నెలలు దాటిన పత్రికలను ఎందుకు ఎంప్యానెల్ చేయడం లేదు? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు లేదు. చిన్న పత్రికలపై వివక్షడ పెద్ద పత్రికలకు అనుకూలత? పెద్ద పత్రికలకు వేల సంఖ్యలో అక్రిడేషన్ కార్డులు ఇస్తున్న ప్రభుత్వం, అదే సమయంలో నూతనంగా ఆర్ఎన్ఐ కలిగిన చిన్న పత్రికల ఎడిటర్లకు ఒక్క స్టేట్ అక్రిడేషన్ మరియు జిల్లా అక్రిడేషన్ ఇవ్వడంలో ఎందుకు వెనకడుగు వేస్తోంది? ఇది కేవలం విధానపరమైన లోపమా? లేక ఉద్దేశపూర్వక వివక్షనా? వారపత్రికలు, మాస పత్రికలకు 18 నెలల అటెండెన్స్ ఉంటే అక్రిడేషన్ ఇస్తున్న ప్రభుత్వం, రోజూ పత్రిక ప్రింట్ తీసుకుంటూ, ఫీల్డ్‌లో పనిచేస్తున్న చిన్న పత్రికలను ఎందుకు పక్కన పెడుతోంది? వార, మాస పత్రికల సర్క్యులేషన్ తక్కువైనా సరే అక్రిడేషన్ ఇస్తారుడ కానీ రెగ్యులర్‌గా న్యూస్ కవర్ చేస్తున్న చిన్న డైలీ పత్రికలకు మాత్రం "నియమాలు" గుర్తొస్తాయి! ఇది న్యాయమా? జర్నలిజంలో ప్రమాణం కేవలం సర్క్యులేషన్‌నా? లేక కంటెంట్, ప్రజా ప్రయోజనమా? చిన్న పత్రికలు ప్రశ్నలు వేస్తాయి. పెద్ద పత్రికలు ప్రభుత్వ ప్రకటనలను మోయగలవు. అందుకేనా ఈ వివక్ష? అక్రిడేషన్ పాలసీ హక్కుల హననం ప్రభుత్వం తీసుకొస్తున్న అక్రిడేషన్ పాలసీ జర్నలిస్టుల ఆశలను కాలరాస్తోందన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. ఈ పాలసీ ద్వారా ఎవరు జర్నలిస్టులు? ఎవరు కాదో ప్రభుత్వం నిర్ణయించాలనుకుంటుందా? జర్నలిస్టు అనేది అక్రిడేషన్ కార్డు వల్ల పుట్టడు. రిపోర్టింగ్ చేయడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికారులను ప్రశ్నించడం ద్వారా జర్నలిస్టు అవుతాడు. అయితే, అక్రిడేషన్ లేకపోతే వార్త కవర్ చేయలేమా? ప్రశ్న అడగలేమా? ప్రజా సమస్యలపై రాస్తే అది నేరమా? ఈ పాలసీ అమలులోకి వస్తే, చిన్న పత్రికలు పూర్తిగా నిర్వీర్యం అవుతాయి. ఇది పరోక్షంగా మీడియా స్వేచ్ఛపై దాడి చేసినట్టే. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛను ప్రభుత్వ పాలసీతో హరించవచ్చా? తెలంగాణలో జర్నలిస్టులు ఇదే ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పోలిక తెలంగాణ ఎందుకు వెనుకబడింది? పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఆర్ఎన్ఐ కలిగిన ప్రతి పత్రికకు కనీస అక్రిడేషన్ ఇస్తున్నారు. అక్కడ చిన్నా పెద్దా అనే తేడా లేదు. అయితే తెలంగాణలో మాత్రం ఎందుకు ఇవ్వడం లేదు? ఇది పరిపాలనా వైఫల్యమా? లేదా విధానపరమైన నిర్లక్ష్యమా? చిన్న పత్రికల ఎడిటర్ల మధ్య జరుగుతున్న చర్చల్లో ఒక మాట స్పష్టంగా వినిపిస్తోంది ప్రభుత్వం పెద్ద పత్రికల చేతిలో కీలుబొమ్మగా మారిందా?ఈ విమర్శలు యథేచ్ఛగా రావడం లేదు. ప్రకటనల పంపిణీ, అక్రిడేషన్ విధానం, ఎంప్యానెల్‌మెంట్ ఆలస్యండ అన్నీ ఒకే దిశగా చూపిస్తున్నాయి. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఆరోపణలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. మీడియా అనేది ప్రభుత్వానికి మిత్రుడు కాదు, శత్రువూ కాదుడ అది ప్రజల గొంతు. ఆ గొంతును నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది. పరిష్కారం ఏంటి? డిమాండ్లు స్పష్టం

> **తెలంగాణలో జర్నలిస్టుల అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రభుత్వ విధానం**
> **జర్నలిజం అంటే అక్రిడేషన్ కార్డా? లేక సమాజానికి నిజం చెప్పే బాధ్యతా?**
> **ప్రభుత్వం పెద్ద పత్రికల చేతిలో కీలుబొమ్మగా మారిందా?**

**చిన్న, మధ్య తరహా పత్రికల జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లు ఇవి:**

ఆర్ఎన్ఐ / పీఆర్జే రిజిస్ట్రేషన్ ఉన్న ప్రతి పత్రికకు కనీస అక్రిడేషన్ ఇవ్వాలి. 18 నెలల ఎంప్యానెల్‌మెంట్ నిబంధనను సంవత్సరాలు తరబడి పెండింగ్ పెట్టకుండా పారదర్శకంగా అమలు చేయాలి. పెద్దచిన్న పత్రికల మధ్య వివక్షను పూర్తిగా తొలగించాలి. అక్రిడేషన్ పాలసీని జర్నలిస్టు సంఘాలతో చర్చించి సవరణ చేయాలి. మీడియా స్వేచ్ఛను హరించే ఏ విధానమైనా వెంటనే ఉపసంహరించాలి. చివరగా ఒక ప్రశ్న అక్రిడేషన్ లేకపోతే జర్నలిస్టు కాదా?ఈ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. ఎందుకంటే జర్నలిస్టుల గొంతు మూగబోతేడ రేపు ప్రజల గొంతు కూడా మూగబోతుంది.

**సెగ్గెం కిరణ్ కుమార్**
**ఎడిటర్, వార్త సంధ్య ప్రత్యేక కథనం**

## హస్తినాపూర్ ఈస్ట్ కాలనీలో పర్యాటించిన వనస్థలిపురం తాజా మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 18:** వనస్థలిపురం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి హస్తినాపూర్ ఈస్ట్ కాలనీలో పర్యటించారు. కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా రహదారి సమస్యపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రోడ్ పనులు ఇప్పటికే ఆమోదం పొందినప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదని ,నివాసితులు వివరించారు.ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందు లను ఓపికగా విని అధికారులతో మాట్లాడారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో హస్తినాపూర్ ఈస్ట్ కాలనీ అధ్యక్షుడు కుంచారపు భూపతి రెడ్డి తో పాటు కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

# మదనపల్లె చిన్నారి హత్య కేసు

**చెరువులో నిందితుడు కులవర్ధన్ మృతదేహం**

**మదనపల్లెలో ఏడేళ్ల బాలిక అదృశ్య ఘటన విషాదంతం**

**నిందితుడు కులవర్ధన్‌ను అరెస్టు చేసిన పోలీసులు**

**నిందితుడి ఇంటి వద్ద మంగళవారం స్థానికుల ఆందోళన**

**నిందితుడిని అప్పగించాలంటూ డిమాండ్ చేస్తూ నిరసన**



అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం కనసానివారిపల్లె చెరువులో యువకుడి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడిని మదనపల్లెలో చిన్నారిపై అత్యాచారం చేసి హతమార్చిన కేసు నిందితుడు కులవర్ధన్‌గా నిర్ధారించారు. చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసి మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారిపై హత్యాచారం కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని ఎస్పీ శ్రీ ధీరజ్ చెప్పారు. నిందితుడిని రక్షక్ వాహనంలో మంగళవారం తీసుకెళ్తుండగా పోలీసుల నుంచి తప్పించుకున్నాడన్నారు. మదనపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రత్యేక బృందాలతో గాలిస్తుండగా కనసానివారిపల్లె చెరువులో బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైందని వెల్లడించారు. దీనిపై అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చామని ఎస్పీ ధీరజ్ తెలిపారు.

### అసలు ఏం జరిగిందంటే?

బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణానికి చెందిన ఏడేళ్ల బాలిక 2వ తరగతి చదువుతోంది. సోమవారం శివరాత్రి సందర్భంగా బడికి సెలవు కావడంతో ఇంటి దగ్గరే ఉంది. పనికి వెళ్లిన ఆమె తల్లి సాయంత్రం 4.30 గంటలకు ఇంటి వద్ద ఉన్న తన తండ్రికి ఫోన్ చేసి, చిన్నారి గురించి అడిగింది. పాప ఇంట్లో లేదని ఆయన తెలిపారు. స్నేహితుల ఇళ్ల వద్ద ఆడుకోవడానికి వెళ్లిందేమో అని మొదట భావించారు. ఎంత సేపటికీ రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వెంటనే రంగంలోకి దిగి గాలింపు మొదలు పెట్టారు. స్థానికంగా వాట్సప్ గ్రూపుల్లో చిన్నారి ఆచూకీ తెలిస్తే చెప్పాలని పోస్టు చేశారు. చిన్నారి ఎదురు ఇంట్లో ఉంటున్న కులవర్ధన్ (30)కు నేర చరిత్ర ఉందని తెలియడంతో రాత్రి 1.30 గంటలకు పోలీసులు అతడి ఇంట్లో గాలించడానికి వెళ్లారు. తలుపు కొట్టినా తీయకపోవడంతో కానిస్టేబుళ్లు కిటికీలోంచి చూశారు. కులవర్ధన్ పడుకుని కనిపించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాలిక చివరిసారిగా కులవర్ధన్‌తోనే కనిపించిందని ఆమె తాత చెప్పారు. దాంతో మంగళవారం ఉదయం 7 గంటలకు మళ్లీ అతడి ఇంటికి వచ్చి తలుపులు బద్దలు కొట్టి, ఇంట్లోకి వెళ్లి చూడగా డ్రమ్ములో చిన్నారి విగతజీవిగా ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. "చిన్నారి హత్య కేసు నిందితుడి మృతదేహం చెరువులో లభ్యమైంది. కులవర్ధన్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాథమిక సమాచారం మేరకు ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోంది. కులవర్ధన్‌ను తీసుకెళ్తుండగా పోలీసుల నుంచి నిన్న తప్పించుకున్నాడు. రక్షక్ వాహనంలో తరలిస్తుండగా కులవర్ధన్ తప్పించుకున్నాడు. ప్రత్యేక బృందాలతో గాలిస్తుండగా కులవర్ధన్ శవం దొరికింది. కనసానివారిపల్లె చెరువులో కులవర్ధన్ మృతదేహం గుర్తించాం. కులవర్ధన్ మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాం. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో మంగళవారం దారుణంగా హత్యకు గురైన బాలికకు ఆమె స్వగ్రామమైన వైఎస్ఆర్ కడప జిల్లా వీరబల్లి మండలంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. బాలిక మృతదేహాన్ని మంగళవారం రాత్రి గ్రామానికి తీసుకురావడంతో ఒకసారిగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం ఉదయం వరకు పోలీసులు అక్కడే ఉండి అంత్యక్రియల ప్రక్రియ పూర్తి చేయించారు. రాజంపేట నియోజకవర్గ ఇంఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబులు గ్రామానికి చేరుకుని బాలిక మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ఒంటరి మహిళపై ఏఎస్‌వో లైంగిక వేధింపులు

**14 రోజుల రిమాండ్**

**అసెంబ్లీలో ఏఎస్‌వోగా పని చేస్తున్న నిందితుడు**

**ఒంటరి మహిళ, ఆమె కుమార్తెకు వేధింపులు**

**బాధితుల ఫిర్యాదుతో అరెస్టు చేసిన పోలీసులు**



ఉన్నతస్థాయి ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తి తన వక్రబుద్ధిని పోనిచ్చుకోలేదు. అసెంబ్లీలో ఏఎస్‌వోగా పని చేస్తూ నగర శివారు ప్రాంతంలో ఒంటరిగా ఉన్న మహిళ, ఆమె మైనర్ కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తించాడు. చివరకు ఏం చేయాలో దిక్కు తోచని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఉన్న ఆమె, తన కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. దాంతో న్యాయస్థానం 14 రోజుల రిమాండ్‌ను విధించింది. ఒంటరి మహిళపై లైంగిక వేధింపులు: మునిరాజా గ్రూప్ 2 ఉద్యోగిగా రాష్ట్ర అసెంబ్లీలో ఏఎస్‌వోగా పని చేస్తున్నాడు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్న ఒంటరి మహిళపైన, మైనర్ బాలికైన ఆమె కుమార్తె పైనా లైంగిక వేధింపులకు తెగబడుతున్నారు. ఆమె నుంచి నుంచి పలు విడతల్లో నగదును తీసుకుని తిరిగి చెల్లించకుండా బెదిరిస్తున్నారు. కులం పేరుతో, సభ్య సమాజం తలదించుకునేలా అసభ్య దూషణలకు పాల్పడుతున్నారు. ఆ మహిళకు సంబంధించిన నగ్న చిత్రాల్ని, దృశ్యాలను పలువురికి పంపిస్తూ ఆమెను నిత్యం ఆందోళనకు గురిచేస్తున్నారు. దాదాపు రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న ఈ వేధింపులపై బాధితురాలు గతంలో ఒకసారి పోలీసులను ఆశ్రయించింది. దాంతో మునిరాజాపై కేసు నమోదైంది. కానీ అయినా సరే అతని ప్రవర్తన ఏ మాత్రం మారలేదు. అంతేకాకుండా వేధింపులు మరింత ఎక్కువ అయ్యాయి. అయితే దీన్ని భరించలేక బాధిత మహిళ తాజాగా మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో మునిరాజాపై కేసు నమోదు చేసి విజయవాడ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం వాదోపవాదాలు ముగిసిన అనంతరం నిందితుడు మునిరాజాకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. మునిరాజాకు గతంలోనూ నేరచరిత్ర ఉన్నట్లు తెలిసింది. అతనిపై చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పోలీసు స్టేషన్‌లో గతంలో సైతం నాలుగు కేసులు, విజయవాడలోని నున్న పోలీసు స్టేషన్ పరిధిలో మరో ఒక కేసు ఉంది. ఖాకీ ముసుగులో ఎన్నో ఘోరాలు: గతంలో తూనికలు కొలతల శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా డిప్యూటేషన్ పై పనిచేసిన మునిరాజా ఆ సమయంలోనే బాధిత మహిళను పరిచయం చేసుకుని ఇక ఆ తర్వాత ఆమె పై నిత్యం వేధింపులకు తెగబడ్డాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ వివరాలన్నింటినీ రిమాండ్ రిపోర్టులో అధికారులు ప్రస్తావించారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్లు చెప్పుకుని ఇతని బెదిరింపులకు పాల్పడుతున్నాడనే తీవ్ర ఆరోపణలున్నాయి. పలు సెక్షన్ల కింద కేసు నమోదు: ఖాకీ యూనిఫాం ముసుగులో ఎన్నో ఘోరాలు, దందాలకు పాల్పడాడు మునిరాజా. తనను లైంగికంగా వేధించారని బాధిత మహిళ ప్రధానంగా ఫిర్యాదులో ప్రస్తావించారు. మునిరాజా పై బీఎన్ఎస్ లోని సెక్షన్ 78 (మహిళలను వేధించడం), 79 (స్త్రీల గౌరవానికి భంగం కలిగించడం), 351 (నేరపూరిత బెదిరింపులు), ఎస్సీ,ఎస్టీ చట్టంలోని 3 (1), (ఆర్), (ఎస్)తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 12 (చిన్నారులపై లైంగిక వేధింపులు) కింద కేసు నమోదైంది. 2018వ సంవత్సరంలో గ్రూప్ 2 కు ఎంపికైన బి.కె మునిరాజా అసెంబ్లీ కార్యాలయంలో ఏఎస్‌వోగా విధుల్లో చేరాడు. తర్వాత రెండేళ్ల పాటు తూనికలు, కొలతల శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా విజయవాడ-1 కార్యాలయానికి వచ్చాడు. ఆ సమయంలోనే 2023, జూన్ 11వ తేదీన విధుల్లో భాగంగా నున్న స్టేషన్ పరిధిలోని ప్రాంతానికి బదిలీపై వెళ్లాడు. అక్కడ ఆర్ఎంపీగా ఉన్న బాధిత మహిళ క్లినిక్ కు వెళ్లి గుండె సమస్యకు సంబంధించి ఆమెకు చెప్పి పరీక్షించమని కోరాడు. అలా పరిచయమై తరచూ ఆమె ఇంటికి వెళ్తుండేవాడు. ఆమెకు భర్త 2022లో అనారోగ్య కారణాలతో చనిపోయాడు. నమ్మించి మోసం: అయితే తన కూమార్తె లాంటి దానివని ఆమెను నమ్మించే ప్రయత్నం చేశాడు. ఆపై ఆమెకు కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగం వచ్చిందని వంచించాడు. హృద్రోగ సమస్యతో నిందితుడు ఆసుపత్రిలో చేరానని, వైద్యం, ఇతర ఖర్చులకు గాను విడతల వారీగా దాదాపు రూ.27 లక్షల వరకు బాధిత మహిళ వద్ద నుంచి తీసుకున్నాడు. అయితే ఆ తర్వాత కాలంలో తీసుకున్న డబ్బులను సైతం ఇవ్వకపోగా ఆమెకూ లైంగిక వేధింపులనేవి ఎక్కువయ్యాయి. ఇంట్లో వారిని ఒప్పించి పెళ్లి చేసుకుంటానని, అంగీకరించాలని వెంటపడి మరీ ఎక్కువగా వేధించడం ప్రారంభించాడు. దీనికితోడు అసభ్యంగా ప్రవర్తిస్తూ, తరచూ లైంగిక దాడికి పాల్పడేవాడు. పలుమార్లు ఆమె పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసేది. కానీ తీరా పోలీసులు ఇంటికి వచ్చే సరికి మునిరాజా అక్కడి నుంచి మెల్లగా జారుకునేవాడు. బాధిత మహిళ పనిచేస్తున్న కార్యాలయానికి కూడా వెళ్లి ఆమెకు తెలియకుండా తీసిన వీడియోలు, ఫొటోలను ఆమె సహోద్యోగులకు పంపించి మానసిక క్షోభకు గురిచేశాడు. తన కోరిక తీర్చకపోతే కుటుంబాన్ని హతమారుస్తానని ఎన్నో బెదిరింపులకు పాల్పడేవాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వేధింపులను భరించలేకే ఫిర్యాదు: ఆమె పిల్లలను సైతం చంపేస్తానని హెచ్చరించేవాడని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. వేధింపులకు తాళలేకే చివరకు బాధితురాలు నున్న విజయవాడలోని నున్న పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఆమె జోలికి వెళ్లనని పోలీసుల సమక్షంలో నిందితుడు చెప్పడంతో ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకుంది. కానీ ఆ తర్వాతే ఆమెకు ఇవ్వాల్సిన మొత్తంలో రూ.6.47 లక్షలు చెల్లించాడు. కానీ మిగిలింది మాత్రం విడతలవారీగా చెల్లిస్తానని వివరించాడు. అనంతరం మళ్లీ కొన్ని రోజులకే వేధింపులు తారాస్థాయికి పెరగడంతో బాధిత మహిళ గత ఏడాది నవంబరు, 9వ తేదీన నున్న స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తనపై కేసు పెట్టిందనే ప్రతీకారంతో మునిరాజా బాధితురాలి ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు కొత్త ఎత్తుగడ వేశాడు. మునిరాజా సహచరులైన రవిపాల్, హరిబాబు, జబేదాల సహకారంతో బాధిత మహిళ ఇంటిని అక్రమంగా అమ్మేందుకు పథకం పన్నాడు. అంతేకాకుండా బాధితురాలు ఇంట్లో లేని సమయంలో మునిరాజా లోపలికి ప్రవేశించి తన 15 ఏళ్ల వయసున్న కుమార్తెపై అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధిత మహిళ పేర్కొంది.

# మహాదేవునికి మాదకద్రవ్యాలు, రీల్స్ పిచ్చితో ఓవరాక్షన్

**వార్నింగ్ ఇచ్చిన సీపీ**

**శివరాత్రి రోజున శివుడికి దైవప్రసాదం పేరుతో**

**మాదకద్రవ్యాలంటూ యువకుల రీల్స్**

**ఆగ్రహం వ్యక్తం చేసిన సీపీ సజ్జనార్**

**ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న**

**చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు**




మహా శివరాత్రి రోజున దేవుడికి మాదకద్రవ్యాలు చూపిస్తూ కొందరు యువకులు రీల్స్ చేయడంపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ వ్యవహారంపై వెంటనే స్పందించిన చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫలక్‌నుమా ప్రాంతంలోని జంగమ్‌మెట్‌కు చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఏం జరిగిందంటే : శివరాత్రి రోజున శివుడికి దైవప్రసాదం పేరుతో కొందరు యువకులు మాదక ద్రవ్యాలు చూపించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా అయ్యింది. అది కాస్తా సీపీ సజ్జనార్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన ఆ వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. దేవుడి ముందు మాదకద్రవ్యాలు చూపిస్తూ రీల్సా? అంటూ మండిపడ్డారు. ఫేమస్ అవ్వడం కోసం ఎంతకైనా తెగిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడికి మాదకద్రవ్యాలు చూపించడం అత్యంత హేయమైన చర్య అని, ఒకరకంగా వికృతమైన ఉన్మాదమని అన్నారు.

### సోషల్ మీడియా వ్యసనాలకు వాకిలిగా కాదు :

సీపీ సజ్జనార్ పోస్ట్ ఇలా.. "మహాశివరాత్రి భక్తికి నిదర్శనం, ముక్తికి సోపానం. పరమ పవిత్రమైన ఈ పర్వదినాన, దైవ ప్రసాదం పేరుతో మత్తు పదార్థాలను ప్రదర్శించడం అత్యంత హేయమైన చర్య. అది వికృతమైన ఉన్మాదం! మేమేదో సాహసం చేశామని అనుకుంటున్నారా!? అస్సలు కాదు. ఇది కటకటాల వెనుకకు చేర్చే తీవ్రమైన నేరం! ఒక్కసారి చీణూా చట్టం ప్రయోగిస్తే జీవితాంతం పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. లైకుల కోసం, లోకాన్నే మరిచి, వ్యూస్ కోసం - విలువలనే వదిలి, రీల్స్ కోసం రోడ్డున పడి, మత్తులో మునిగి జీవితాలను నాశనం చేసుకుంటారా!? చెప్పండి. క్షణికానందం ఇచ్చే లైకులు, వ్యూస్ కోసం మీ బంగారు భవిష్యత్తును బలిపెట్టకండి. ఇటువంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించం. బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. సోషల్ మీడియాను మీ సృజనాత్మకతకు వేదికగా మార్చుకోండి వ్యసనాలకు వాకిలిగా కాదు" అని రాసుకొచ్చారు.

### స్పందించిన చార్మినార్ పోలీసులు :

సీపీ పోస్టు వ్యవహారంపై తక్షణమే స్పందించిన చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఫలక్‌నుమా జంగమ్‌మెట్‌కు చెందిన సభావత్ శ్రీ చరణ్, వర్తేవత్ విజయ్ కృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని ఫలక్‌నుమా పోలీసులకు అప్పగించారు. "సోషల్ మీడియాలో వచ్చే లైకులు, వ్యూస్ మిమ్మల్ని కాపాడవు. అవి కేవలం క్షణికానందం మాత్రమే. కానీ చట్టం వేసే శిక్ష మాత్రం జీవితకాలం వెంటాడుతుంది. సోషల్ మీడియా మత్తులో పడి మీ బంగారు భవిష్యత్తును 'కటకటాల' పాలు చేసుకోకండి!" - వి.సి.సజ్జనార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌సీపీ సజ్జనార్ సమాజం అవగాహన కోసం సోషల్ మీడియాలో యాక్టివ్ ఉంటారు. ప్రస్తుత సమస్యలను పోస్టు చేస్తూ ఉంటారు. మంచి పని చేసిన వారిని ప్రోత్సహిస్తుంటారు. ఆయన ఎక్స్ అకౌంట్‌కు సుమారు లక్ష 80 వేలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఇంతుకు ముందు తెలంగాణ ఆర్టీసీ ఎండీగా ఉన్నప్పుడు కూడా ఆయన పలు అంశాలపై ట్వీట్ చేస్తుండేవారు. తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాలు విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ కోసం తప్పుడు ప్రచారం, హేయమైన చర్యలకు పాల్పడే తప్పవని తెలంగాణ పోలీసులు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు.


## చైనా రోబో డాగ్ కొని తామే అభివృద్ధి చేశామని ప్రచారం

**ఏఐ సదస్సులో యూనివర్సిటీ చీటింగ్**

**సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో బయటపడ్డ మోసం**

**గల్గోటియాస్ యూనివర్సిటీని సదస్సు నుంచి బహిష్కరించిన నిర్వాహకులు**

**విద్యార్థుల పరిశోధనల కోసమే వాడుతున్నట్లు వర్సిటీ వివరణ**




కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఓ యూనివర్సిటీ నిర్వాకంతో కలకలం రేగింది. చైనాకు చెందిన రోబో డాగ్ ను తమ ఆవిష్కరణగా ప్రదర్శించడమే ఈ కలకలానికి కారణం. ఉత్తరప్రదేశ్ కు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ప్రతినిధులు ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. సోషల్ మీడియాలో ఈ రోబోట్ వీడియోలు వైరల్ కాగా.. చైనాకు చెందిన రోబో డాగ్ ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించడంతో యూనివర్సిటీ మోసం బయటపడింది. దీంతో యూనివర్సిటీపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. సదస్సు నుంచి ఆ విద్యాసంస్థను తక్షణమే గెంటివేసి, వారికి కేటాయించిన స్టాల్‌ను అధికారులు ఖాళీ చేయించారు.

**అసలేం జరిగిందంటే..**

గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ఏఐ సదస్సులో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. తమ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో పేరుతో ఒక రోబోడాగ్‌ను స్వయంగా అభివృద్ధి చేశామని వర్సిటీ ప్రతినిధులు ప్రచారం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

**మోసం బయటపడిందిలా..**

యూనివర్సిటీ ప్రదర్శించిన రోబోడాగ్ చైనాకు చెందిన రోబోటిక్ కంపెనీ 'యూనిట్రీ' అభివృద్ధి చేసిన '+శీ2' మోడల్‌ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించారు. ఆన్‌లైన్ లో సుమారు రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల ధరకు భారతీయులకూ ఈ రోబోడాగ్ అందుబాటులో ఉంది. దీంతో సదరు యూనివర్సిటీ మోసం బయటపడింది. విదేశీ టెక్నాలజీని కొనుగోలు చేసి, దానిని భారత్ ఆవిష్కరణగా ప్రచారం చేసుకోవడంపై నెటిజన్లు తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

**యూనివర్సిటీ ఏమంటోందంటే..**

వివాదం ముదరడంతో యూనివర్సిటీ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది. తాము దానిని చైనా నుంచే కొనుగోలు చేశామని చెప్పింది. విద్యార్థుల పరిశోధనల కోసం ఒక సాధనంగా మాత్రమే వాడుతున్నామని పేర్కొంది. ఆ రోబో డాగ్ ను తామే అభివృద్ధి చేశామని ఎక్కడా ప్రచారం చేసుకోలేదని పేర్కొంది. అయితే, సోషల్ మీడియాలో ఉన్న వీడియోల్లో మాత్రం ఆ విద్యాసంస్థ ప్రతినిధులు ఇది తమ సొంత ఆవిష్కరణ అని స్పష్టంగా చెప్పడం గమనార్హం.

**కేంద్రం సీరియస్.. కఠిన చర్యలు**

అంతర్జాతీయ ప్రతినిధులు, టెక్ దిగ్గజాలు హాజరైన సదస్సులో ఇలాంటి తప్పుదారి పట్టించే చర్యలకు పాల్పడటంపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన గల్గోటియాస్ యూనివర్సిటీ స్టాల్‌ను తొలగించి, సదస్సు నుంచి వారికి ఉద్వాసన పలికింది.

## 63 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపు

**సీబీఐటీలో అత్యధికంగా రూ.1.83 లక్షలు**

**మొత్తం 152 కళాశాలల ఫీజు ఖరారు**

**త్వరలో జీఓ జారీ చేయనున్న విద్యాశాఖ**

**63 కళాశాలలు ఫీజులు పెంచుకునేందుకు అనుమతి**

**70 కళాశాలల్లో పాత ఫీజులేనని వెల్లడి**



తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) 63 కళాశాలలు ఫీజులు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. 70 కళాశాలల్లో పాత ఫీజులను కొనసాగించడంతో పాటు 19 కళాశాలల్లో ఇప్పుడున్న ట్యూషన్ ఫీజుల్లో కోత విధించనున్నట్లు తెలుస్తోంది. (టీఏఎఫ్ఆర్సీ) హైదరాబాద్‌లోని నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాలకు గరిష్ఠంగా రూ.62 వేలు పెంచుకునేందుకు, మిగిలిన కళాశాలలు స్వల్పంగా పెంచుకునేందుకు అనుమతి లభించనుంది. ప్రస్తుతం నుంచే అమలులోకి : మొత్తంగా 152 కళాశాలల ఫీజులను ఖరారు చేస్తూ సంబంధిత జాబితాను టీఏఎఫ్ఆర్సీ కొన్ని నెలల క్రితం తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించింది. ఆ వివరాలు తాజాగా బహిర్గతమవడంతో వివరాలు తెలిశాయి. విద్యాశాఖ జీఓ జారీచేస్తే ప్రస్తుత విద్యా సంవత్సరం(2025-26) నుంచే ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి. అవి 2025-28 వరకు(బ్లాక్ పీరియడ్‌కు) వర్తింపు అవుతాయి.

**అత్యధికం రూ.1.83 లక్షలు :** తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా సీబీఐటీ (చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) లో రూ.1.83 లక్షల ఫీజును ఖరారు చేశారు. గత ఏడాది వరకు ఆ కాలేజీ ఫీజు రూ.1.65 లక్షలుగా ఉండగా ఈసారి రూ.18 వేలు పెంచడంతో రూ.1.83 లక్షలకు చేరుకుంది. తెలంగాణలోనే అత్యధికంగా నారాయణమ్మ కాలేజీలో రూ.62 వేలు పెంచారు. 2019లో ఆ కళాశాల ఫీజు రూ.1.22 లక్షలుండగా, 2022లో రూ.లక్షకు కుదించారు. దాన్ని పరిగణనలోకి తీసుకొని ఈసారి ఎక్కువ మొత్తంలో పెంచినట్లు అధికార వర్గాలు భావిస్తున్నారు.

**గురునానక్‌లో రూ.77లకు తగ్గించిన ఫీజు :** 36 కళాశాలల్లో రూ.10 వేల లోపు, మరో 18 కళాశాలల్లో రూ.10 వేల నుంచి రూ.20 వేల లోపు, 9 కళాశాలల్లో రూ.20 వేల నుంచి రూ.35 వేల లోపు పెంచారు. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూ.50, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో రూ.200ల ఫీజు పెరిగింది. 19 కళాశాలల్లో గత ఏడాది వరకు ఉన్న ఫీజులో కోత పడటం గమనార్హం. ఆ తగ్గింపు రూ.3,400 నుంచి రూ.43 వేల వరకు ఉంది. హైదరాబాద్ శివారు ప్రాంతం గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇప్పటివరకు ఫీజు 1.20 లక్షలుండగా, దాన్ని రూ.77 వేలకు తగ్గించారు.

**రూ.లక్షకు పైగా ఫీజున్న కాలేజీల వివరాలివే :** సీబీఐటీ(1.83), వాసవి(1.75), ఎంజీఐటీ(1.67), సీవీఆర్(1.63), నారాయణమ్మ(1.62), గోకరాజు(1.60), వీఎన్ఆర్(1.59), బీవీఆర్ఐటీ(1.46), కిట్స్(1.46), ఎంవీఎస్ఆర్(1.44), బీవీఆర్ఐటీ మహిళా కళాశాల(1.43), ఎస్ఆర్(1.41), వర్ధమాన్(1.40), శ్రీదేవి(1.37), శ్రీనిధి(1.33), గురునానక్ టెక్నికల్(1.29), కేఎంఐటీ(1.29), ముఫకంజా(1.25), విజ్ఞాన్(1.23), గీతాంజలి(1.21), శ్రీఇందు(1.15), ఏస్(1.10), జేబీఐటీ(1.10), అను బోస్(1.08), శ్రేయాస్(1.06), హితమ్(1.05), వాగ్దేవి(1.05), విజ్ఞాన్స్ మహిళ(1.04), కేజీ రెడ్డి( 1.03), వీబీఐటీ(1.03), టీకేఆర్(1.03), శ్రీదత్త(1.01).

**లక్ష ఫీజున్న ఇంజినీరింగ్ కాలేజీలు : మాతృశ్రీ( 1.00), గేట్(1.00), లార్డ్స్(1.00).**

కేసులు పెట్టాలని సీఎం ఆదేశం : గత సర్కారు తీరులా కాకుండా పలు ఇంజినీరింగ్ కాలేజీల వసూలు దందాను నియంత్రించాలని కొద్ది రోజుల క్రితం నిర్వహించిన ఓ సమీక్షలో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఫీజులు పెంచుకునేందుకు తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీకి తప్పుడు పత్రాలు అందజేసిన ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలపై కేసులు పెట్టాలని కూడా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని పలు ఇంజినీరింగ్ కాలేజీలు అధ్యాపకులకు ఎక్కువ మొత్తంలో వేతనాలు ఇచ్చినట్లు, నిర్వహణ పనులకు అధికంగా ఖర్చు చేసినట్లు టీఏఎఫ్ఆర్సీకి తప్పుడు లెక్కలు సమర్పించాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. విద్యను వ్యాపారం చేయొద్దని సీఎం పలుమార్లు బహిరంగంగా సూచించారు. తమ ప్రభుత్వం పేద పిల్లలకు తప్పకుండా విద్యను అందించి గొప్ప పౌరులుగా తీర్చి దిద్దేందుకు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

# పార్కిన్సన్స్ ప్రాణాంతకమా?




పార్కిన్సన్స్ వ్యాధి శరీర అవయవాల కదలికలకు సంబంధించిన రుగ్మతల విభాగంలోకి చేరుతుంది. శరీర భాగాలు అప్రయత్నంగా వణకడం (ట్రెమర్స్), పట్టేసినట్టు ఉండటం (స్టిఫ్‌నెస్), కదలికలు నెమ్మదించడం (స్లోనెస్), శరీరం పట్టుతప్పడం (ఇంబాలెన్స్) లాంటివి పార్కిన్సన్స్ ప్రధాన లక్షణాలు. అయితే ఇవి మాత్రమే కాకుండా ఈ వ్యాధిలో ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. వీటిని నాన్‌మోటార్ లక్షణాలుగా పేర్కొంటారు. జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక సమస్యలు, కుంగుబాటు, ఆందోళన, మతిభ్రమించడం (సైకోసిస్), నిద్ర సంబంధ సమస్యలు, మూత్ర సమస్యలు, మలబద్ధకం, వాసన లోపించడం, అతిగా చెమట పట్టడం, తిమ్మిర్లు (నంబ్‌నెస్), నొప్పి మొదలైనవి ఉంటాయి. సాధారణంగా 50 ఏండ్లు దాటిన వాళ్లకే పార్కిన్సన్స్ వస్తుంది. అయితే, యువకులు, కౌమార వయసువారికి కూడా ఇది రావొచ్చు. 30 ఏళ్ల లోపు వస్తే యంగెస్ట్ ఆన్‌సెట్ ఆఫ్ పార్కిన్సన్స్ డిసీజ్ అని, 20 లోపే వస్తే జువనైల్ పార్కిన్సన్స్ డిసీజ్ అని పిలుస్తారు. ఏ వయసు వారికైనా ఇది రావచ్చు. కాకపోతే యువతలో ఈ వ్యాధి తలెత్తడానికి జన్యుపరమైన కారణాలు ప్రధానంగా ఉంటాయి. చికిత్స ఉన్నప్పటికీ పార్కిన్సన్స్‌ను పూర్తిగా నయం చేయలేం. పైగా జీవిత కాలం పాటు చికిత్స అవసరమవుతుంది. ఈ వ్యాధికి ఇప్పుడు మందులు, ఇంజెక్షన్లు, సర్జరీ లాంటి వివిధ రకాలైన ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇంకో విషయం%ా% పార్కిన్సన్స్ వ్యాధి ప్రాణాంతకం కాదు. అయితే శరీరాన్ని ఇది అచేతనం చేస్తుంది. రోజువారీ పనులు, జీవన నాణ్యత మీద పార్కిన్సన్స్ ప్రభావం చూపుతుంది. అయితే, పార్కిన్సన్స్ బాధితుల జీవిత కాలం మాత్రం సాధారణ మనుషుల్లానే ఉంటుంది.

# ఈ చిట్కాలు పాటిస్తే మహిళలు నొప్పుల నుంచి ఈజీగా తప్పించుకోవచ్చు



పురుషులతో పోలిస్తే.. మహిళల్లో నొప్పులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వెన్నునొప్పి, కీళ్లనొప్పులు, మైగ్రేన్, నెలసరి సమయంలో వచ్చే నొప్పులు వారిని విపరీతంగా వేధిస్తుంటాయి. ఒక సర్వే ప్రకారం.. ప్రతి వందమందిలో దాదాపు 45 మంది మహిళలు ఏదో ఒక దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతుంటారట. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, స్వీయ సంరక్షణ చర్యల ద్వారా ఆయా నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## కీళ్ల నొప్పులు

జన్యుపరమైన సమస్యలు, హార్మోన్లలో హెచ్చుతగ్గులు, మానసిక ఒత్తిడి.. మహిళలను కీళ్లనొప్పుల బారిన పడేస్తాయి. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువైనా, క్యాల్షియం, విటమిన్ డి తగ్గినా.. ఈ సమస్య తీవ్రం అవుతుంది. యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో వెల్లుల్లి అద్భుతంగా పనిచేస్తుంది. కీళ్లనొప్పులతో బాధపడేవారు ఉదయం ఖాళీ కడుపుతో మూడు నుంచి నాలుగు వెల్లుల్లి రెబ్బలు తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. పసుపులో ఉండే 'కర్కుమిన్' కూడా సహజసిద్ధమైన నొప్పి నివారిణి. గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక చెంచా పసుపు కలిపి తాగితే.. కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

## మైగ్రేన్‌జి

పురుషుల కన్నా.. మహిళలు తరచుగా తలనొప్పికి గురయ్యే అవకాశం మూడు రెట్లు ఎక్కువ. రుతుస్రావం, హార్మోన్లలో హెచ్చుతగ్గులు, జీవనశైలి, ఒత్తిడి ఇందుకు కారణం. 93% మంది ప్రజల్లో తలనొప్పికి కారణం.. ఒత్తిడేనని తేలింది. డ్రైఫ్రూట్స్ పెయిన్ కిల్లర్స్‌లా పనిచేస్తాయి. జీడిపప్పు, బాదం, పిస్తా లాంటివి తీసుకోవడం ద్వారా తల నొప్పిని తగ్గించుకోవచ్చు. మైగ్రేన్‌తో ఎక్కువగా ఇబ్బంది పడేవారు.. క్రమం తప్పకుండా పుదీనా తీసుకోవడం మంచిది. అల్లంలోనూ తలనొప్పిని తగ్గించే లక్షణాలు ఉంటాయి. డీహైడ్రేషన్ కూడా తీవ్రమైన తలనొప్పిని కలిగిస్తుంది. కాబట్టి, కీరదోస వంటివి ఆహారంలో చేర్చుకోవాలి.

## నెలసరి నొప్పులు

పీరియడ్ హెల్త్ స్టడీ ప్రకారం.. దేశంలోని 83% మంది మహిళలు నెలసరి నొప్పితో బాధపడుతున్నారట. వీరిలో 10శాతం మందిలో నొప్పి తీవ్రంగా ఉంటూ.. రోజువారీ పనులు కూడా చేసుకోలేక పోతున్నారట. ఇలాంటివారు నెలసరి సమయంలో దుంపకూరలతోపాటు అల్లం ఎక్కువగా తీసుకోవాలి. అల్లంలో ఉండే వైద్య గుణాలు, యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు.. కడుపులో కలిగే ఇబ్బందిని కంట్రోల్ చేస్తాయి. పెరుగు, ఎండుద్రాక్షలను కలిపి తీసుకోవడం ద్వారా నెలసరి నొప్పుల నుంచి బయటపడొచ్చు. సోంపు గింజల్ని నమిలినా, వాటిని నీటిలో మరిగించి తాగినా నెలసరి నొప్పులు తగ్గుతాయి.

# పుట్టుకతో థైరాయిడ్ సమస్య



మా పాపకు పుట్టిన రోజే జాండిస్ ఉంది. చికిత్స చేయించాం. మూడు వారాలు గడిచినా తగ్గలేదు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే కొన్ని పరీక్షలు చేశారు. థైరాయిడ్ సమస్య ఉందని నిర్ధారించారు. పాపకు జీవితాంతం థైరాయిడ్ మందు వాడాలని చెప్పారు. నెల వయసు బిడ్డకు థైరాయిడ్ సమస్య వస్తుందా? జీవితాంతం మందులు వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా ఉంటాయా? మీరు చెప్పినదాన్ని బట్టి మీ బిడ్డకు పుట్టుకతోనే థైరాయిడ్ హార్మోన్‌లో లోపం ఉంది. దీనిని హైపోథైరాయిడిజం అంటారు. వెయ్యి మంది శిశువుల్లో ఒకరు ఈ సమస్య బారినపడుతుంటారు. థైరాయిడ్ సమస్యను తొందరగా గుర్తించిన వైద్యుడిని అభినందించాలి. కామెర్ల వ్యాధి రెండు, మూడు వారాలు గడిచినా తగ్గనప్పుడు.. అది పుట్టుకతో సాధారణంగా వచ్చిన కామెర్ల వ్యాధా? లేక వేరే ఇబ్బందులు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు పరీక్షలు చేస్తారు. వాటిలో ముఖ్యమైంది థైరాయిడ్ పరీక్ష. హైపోథైరాయిడిజంతో బాధపడే పిల్లల్లో థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉండటం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల పూర్తిగా జరగదు. కాబట్టి భవిష్యత్‌లో మీ బిడ్డకు ఇబ్బందులు రావొచ్చు. కానీ, సకాలంలో వైద్యుడు ఆ సమస్యను గుర్తించడం, సరైన చికిత్స జరగడం వల్ల మీ బిడ్డకు శారీరక, మానసిక వైకల్యం కలగదు. ఈ సమస్య జీవితాంతం ఉంటుంది. కాబట్టి ఎప్పుడూ మందులు వాడుతూ ఉండాలి. శరీరంలో ఉండాల్సిన హార్మోన్ లేకపోవడం వల్ల దానిని మందుల రూపంలో అందిస్తున్నారు. కాబట్టి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

# మెగ్నీషియం.. మెగా ప్రయోజనం!



మారుతున్న జీవనశైలి.. మనిషిని మంచాన పడేస్తున్నది. అవసరమైన పోషకాలు లేక.. శరీరం రోగాల పుట్టగా మారుతున్నది. చీటికీమాటికీ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నది. ముఖ్యంగా, 'మెగ్నీషియం' లోపంతో నవతరం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నది. రోజువారీ జీవితంలో కీలకపాత్ర పోషించే మెగ్నీషియం.. మనిషి శరీరంలో జరిగే సుమారు 300 రకాల రసాయనిక చర్యల్లో కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటి మెగ్నీషియం లోపిస్తే.. తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ లెక్కల ప్రకారం.. ప్రతిరోజూ పురుషులకు 400 మి.గ్రా., మహిళలకు 300 మి.గ్రా. మెగ్నీషియం అవసరమవుతుంది. రోజువారీగా తీసుకునే ఆహారం ద్వారా ఇది శరీరానికి అందుతుంది. అయితే, శరీరానికి తగినంత మెగ్నీషియం అందకపోతే.. మనిషిలో అనేక లక్షణాలు కనిపిస్తాయి. వీటిని ముందుగానే గుర్తించి, వైద్యుణ్ని సంప్రదిస్తే మంచిది. శరీరంలో మెగ్నీషియం తగినంత పరిమాణంలో ఉంటేనే.. హృదయ స్పందనలు సక్రమంగా సాగుతాయి. లేకుంటే.. హార్ట్‌రేట్ రూటు మారుతుంది. గుండె దడగా అనిపిస్తుంది. ఊపిరి పీల్చుకోవడంలోనూ ఇబ్బంది కలుగుతుంది. వికారంగా అనిపించినా, ఆకలి లేకపోయినా.. మీ శరీరంలో మెగ్నీషియం లోపం ఉన్నట్టే! జీర్ణాశయం సజావుగా పనిచేయడంలోనూ మెగ్నీషియం పాత్ర ఉంటుంది. శరీరంలో మెగ్నీషియం తగ్గితే.. జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. శరీరంలో తగినంత మెగ్నీషియం లేకుంటే.. కంటి సమస్యలూ చుట్టుముడతాయి. కళ్ల మంట, కళ్ల నుంచి నీరుకారడం లాంటి సమస్యలు కనిపిస్తాయి. కండరాల ఆరోగ్యం, పనితీరులో మెగ్నీషియం కీలకంగా వ్యవహరిస్తుంది. ఇది శరీరంలో తగినంతగా లేకపోతే తీవ్రమైన కండరాల నొప్పి, తిమ్మిరి వేధిస్తాయి. మెగ్నీషియం లోపం.. మనిషికి నిద్రను దూరం చేస్తుంది. నిద్రలేమితోపాటు తలనొప్పి, చికాకు ఇబ్బంది పెడుతాయి. ఎముకలు, నరాలు ఆరోగ్యంగా ఉండాలన్నా, వాటి పనితీరు బాగుండాలన్నా.. కావాల్సినంత మెగ్నీషియం ఉండాల్సిందే! కాల్షియం కూడా చాలా అవసరం. ఈ ఖనిజాలలో అసమతుల్యత కండరాల తిమ్మిరి, కండరాల నొప్పికి కారణమవుతుంది. కాల్షియం, మెగ్నీషియం రెండిటినీ సమతుల్యంగా ఉంచుకోవడం చాలా అవసరం.

## ఆహారంతో అందిద్దాం..

మెగ్నీషియం లోపం ఉన్నవారు రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. గుమ్మడి గింజలు, పాలకూర, బచ్చలికూర, అరటిపండ్లు, నల్ల జీలకర్ర, పల్లీలు, బ్రౌన్ రైస్, సాల్మన్ చేపల్లో మెగ్నీషియం ఎక్కువగా దొరుకుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, అవకాడో, నట్స్, బ్రౌన్ రైస్, తృణధాన్యాలు, బీన్స్, పప్పు దినుసులు, పచ్చి బఠానీలు, శనగలు, పాలు, పెరుగు, సోయా ఉత్పత్తుల్లోనూ మెగ్నీషియం లభ్యమవుతుంది. బెర్రీలు, అంజీర్, బ్రకోలీ, క్యాబేజీ, మొలకలలోనూ మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. ఇక శరీరంలో మెగ్నీషియం తక్షణమే ఉత్పత్తి కావాలంటే.. ఒక కప్పు కాఫీ తాగడమో.. ఒక డార్క్ చాక్లెట్ తినడమో చేయాలి.

# జాయ సేనాపతి చారిత్రక కాల్పనిక నవల



జరిగిన కథ : కృష్ణమ్మ ఉప్పెనలో కొట్టుకొని పోయిన జాయపుడు, మువ్వ.. చచ్చిబతికి, కూసెనపూండి అగ్రహారం మాదిగవాడకు చేరుకున్నారు. మిత్రుడు పరాశరుడితోపాటు తమ్ముని కోసం పృథ్వీశ్వరుడు నియమించిన పల్లికేతు, విక్రమ.. జాయపుణ్ని వెతుక్కుంటూ వచ్చారు. తన యోగక్షేమాలతోపాటు తనను రక్షించినవారిని వదిలివెళ్లడం ఇష్టంగా లేదనీ, ఆరోగ్యం కుదుటపడ్డాక వస్తాననీ పల్లికేతు ద్వారా అన్న పృథ్వీశ్వరుడికి తెలియజేశాడు జాయపుడు. వాడవాసులకు తాను జగన్నాథుడని, అనుమకొండవాసిననీ చెప్పాడు. ఆరోగ్యం కుదుటపడే వరకూ అక్కడే ఉండి ఆ సమయాన్ని యక్షగానాలు, నాట్యరూపకాల రచనకు ఉపయోగించాలని అనుకున్నాడు జాయపుడు. పరాశరునితో తాళపత్రాలు, ఘంటాలు, సిరా పిడతలు తెప్పించుకున్నాడు. ఆ కూసెనపూండి గ్రామంతో తన కళాజీవితం పెనవేసుకుంటున్నదని.. ఇక్కడే తానొక మహాకళాక్షేత్రాన్ని నిర్మించబోతున్నానని జాయపుడు ఊహించలేదప్పుడు. పర్ణశాలకు కాస్త ఆవలగా గజ్జెలసవ్వడి! ఏదో నాట్యాభ్యాసం, నాట్యశిక్షణ లాంటిది జరుగుతున్నట్లు వినిపిస్తున్నది. కాస్త ఓపిక చేసుకుని మెల్లగా పర్ణశాల బయటికి వచ్చి, అటుగా పోతున్న వ్యక్తిని అడిగాడు జాయపుడు.

**"ఆ గజ్జెల శబ్దం ఏమిటి?" అని.**

"ఇది బాగోతుల కూసెనపూండి గందా. ఆ బాగోతుల సిద్ధయ నాట్టెం నేర్పుతాడుగా.." చెబుతూ వెళ్లిపోయాడు. జాయపుడు మెల్లగా కుంటుకుంటూ ఆ గజ్జెలసవ్వడి వినవచ్చిన వైపుగా వెళ్లి.. అగ్రహారంలో నాట్యాభ్యాసం జరుగుతున్న గృహాన్ని గుర్తించాడు. గజ్జెలశబ్దం, నట్టువాంగం, ఓ పాట.. గాలితో కలగలిసి వీధులవెంట ప్రవహిస్తూ చిందులు వేస్తున్నది. చక్కగా అలికి ముగ్గులుపెట్టిన మట్టి అరుగుపై కూర్చుని నాట్యానికి కూర్చిన పాటను వింటూ నాట్య భంగిమలు ఊహిస్తున్నాడు. నాట్యగురువు శిష్యులకు కొన్ని కిటుకులు చెప్పడం వినిపిస్తున్నది. అనంతరం పిల్లలు గోలగోలగా అరుచుకుంటూ బయటికి పరుగులు పెట్టారు. తర్వాత బయటికి వచ్చాడు నాట్యగురువు సిద్ధయ. మీగడ వర్ణపు ధోవతిపై వెండివర్ణపు పట్టుకండువా వల్లెవాటుగా ధరించి, విశాలమైన నుదుట తిరునామం, నున్నగా దువ్వికట్టిన శిఖతో నాజూకు శరీరంతో నవనవలాడుతూ ముప్ఫైలలో ఉన్న యువకుడతను. జాయపుణ్ని చూసి. "అరెరే.. బయటే కూర్చున్నారు. తమరెవరో మహాపురుషుల్లాగా ఉన్నారు?" అన్నాడు ప్రశ్నార్థకంగా. జాయపుడు మాత్రం ఎక్కువమంది పిల్లలు బ్రాహ్మణ ఆహార్యంలో ఉండటం చూస్తున్నాడు. "పురుషుణ్నే కానీ మహాపురుషుణ్ని కాను.." అంటూ నవ్వాడు. "నా పేరు జగన్నాథుడు. అనుమకొండ నివాసిని. నంగెగడ్డలో బంధువులు ఉంటే చూసిపోవడానికి వచ్చి ఉప్పెన బారినపడి ఇక్కడ తేలాను!". "ఆ వ్యక్తి తమరేనా!? విన్నాను. అయితే అనుమకొండ వారన్నమాట. ఆగండాగండి ఆసనం తెస్తాను!". "వద్దొద్దు. ఇంతకన్నా ఉన్నతాసనం ఉంటుందా?" అంటూ బాసింపట్టును పద్మాసనంలోకి మార్చాడు జాయపుడు. "నాపేరు సిద్ధయ. ఊరివాళ్లు భాగోతుల సిద్ధయ అంటారు" చెబుతూ జాయపుని ముందు చతికిలబడ్డాడు. 'తిరునామం పెట్టుకున్నవాళ్లను 'భాగవతులు' అంటూండటం ద్వీపరాజ్యంలో మరీ ఎక్కువగా వినిపిస్తున్నదే!' అనుకున్నాడు జాయపుడు. "ఇదేమిటి.. మీ విద్యార్థులంతా బ్రాహ్మణులేనా.. ఇతరులకు నేర్పరా??!". "అందరూ నాపై చేసే విమర్శ అదే. ఇది పూర్తిగా బ్రాహ్మణ అగ్రహారం. ఇది పాతికగృహాల గ్రామంగా ఉన్నప్పుడే అప్పటి పాలకుడు రాజేంద్రచోళుడు 'కూసెనభట్టు' అనే ఉపాధ్యాయునికి దానం చేశారు. ఇక్కడి కులీనరైతులు పంట సాగుచేసి ధాన్యంవాటాను అగ్రహార వారసునికి ఇస్తారు కానీ, పిల్లలను చదువులకే పంపరు. ఇక నాట్యం అంటే మక్కెలు విరగ్గొడతారు. ఆసక్తిగల పిల్లలు కొందరున్నా.. వాళ్లూ నిత్యమూ తరగతులకు రారు. అందువల్ల చదువే ఏకైకవృత్తిగా గల బ్రాహ్మణ పిల్లలే ఎక్కువగా వస్తారు. అందువల్లనేమో కూసెనపూండిని అందరూ భాగోతుల కూసెనపూండి అంటున్నారు". మరో వాస్తవం చెప్పాడు భాగవత సిద్ధయ. "పంచముల పిల్లలకు కళలంటే ఆసక్తి ఉన్నా.. సామాజిక కట్టుబాట్లు ప్రధాన అడ్డంకి. అగ్రహార పెద్దలు కూడా దైవదత్తమైన కళను పంచములకు నేర్పడం అంతగా ఇష్టపడరు. ఎవరికైనా నాట్యం నేర్పడానికి నా గృహం ఎప్పుడూ తెరిచే ఉంటుంది. ఇన్ని సామాజిక కట్టుబాట్ల మధ్య తరగతికే రానివారికి నాట్యం నేర్పలేను కదా!?". అనుభవంతో ఆయన చెప్పినదాంట్లో వాస్తవం ఉంది. "ఓ రహస్యం.. మనసులో పెట్టుకోండి. నాట్యంపట్ల ఆసక్తి ఉన్న పంచముల పిల్లలకు జంధ్యంవేసి నాట్యం నేర్పుతుంటాను. ఇది చాలామంది గురువులు చేసేపనే! ఆసక్తి ఉన్నవాడికి చెప్పాలన్న దురద గురువులకు ఉండటం సహజం. ఇది తాతల కాలంనుంచి ఉన్న అనుభవమే. ఇప్పుడు గొప్ప నాట్యాచార్యులుగా గుర్తింపు పొందుతున్నవారిలో ఈ తరహా పంచములు కూడా ఉన్నారని మీకు తెలిసి ఉండొచ్చు!". ఆశ్చర్యపోయిన జాయపుడు సిద్ధయతో కలిసి భళ్లున నవ్వాడు అంగీకరిస్తున్నట్లు. అతనికి మువ్వ గుర్తొచ్చింది. ఈయన మువ్వను చూస్తే తప్పక నాట్యం నేర్పేవాడేమో.. కానీ ఆమెకు జంధ్యం వెయ్యడం ఎలా!?.. మళ్లీ నవ్వు తన్నుకురాగా లేచి నమస్కరించాడు. "సంతోషం మీ పరిచయం. రేపు మీ నాట్యాభ్యాసం చూడటానికి అనుజ్ఞ ఇవ్వండి". "అయ్యయ్యో.. రేపే మేము దక్షిణాదికి వెళ్లబోతున్నాం. దాదాపు రెండుమాసాల తర్వాత తిరిగి గ్రామం చేరతాం. అప్పుడు తమరు మా ప్రదర్శనను మీకు చూపే అవకాశం మాకు ఇవ్వండి.." అన్నాడు. "అలాగా!? నాకూ మరిన్ని పనులున్నాయి. లేకుంటే మీతోనే వచ్చేవాణ్ని!" అంటూ.. అతణ్ని సంతోషపుచ్చి వెనుతిరిగాడు. తర్వాత తర్వాత రాజబంధువు జగన్నాథునికి, గొప్ప నాట్యకారుడు, నాట్యగురువు సిద్ధయకు మధ్య అపూర్వ స్నేహం, అనుబంధం ఏర్పడ్డాయి. గుంపులుగా వివిధ సామాజికవర్గాలు వేరువేరు రాజ్యాలకు, మండలాలకు, నాడులకు తరలిపోవడం ఇప్పుడు సర్వసాధారణం. ముఖ్యంగా బ్రాహ్మణులు, పండితులు ఎక్కడ పాలకుల అనుగ్రహం ఉందని తెలుస్తుందో.. అక్కడికి వెళ్లిపోతుంటారు. పంచాణంవారిని అనేక రాజ్యాలవారు నెత్తిన పెట్టుకుంటారు. సేవావృత్తులైన చాకలి, మంగలివాళ్ల కోసం చాలాగ్రామాల రట్టలు బాజాభజంత్రీలతో ఆహ్వానాలు పలుకుతుంటారు. కరువు కాలంలో, అంటువ్యాధుల కాలంలో రైతులు, రైతుకూలీలు దూరరాజ్యాలకు వెళ్లడం కద్దు. రాజాశ్రయమే ముఖ్యమైన ప్రదర్శన కళాబృందాలు సంచారజాతుల్లా ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు. వెలనాడు సంపద్వంతమైన రాజ్యం కావడంతో రైతులు, కూలీలు, వృత్తులవారి కంటే కళాకారబృందాలే ఎక్కువగా వస్తూ పోతూ బాగా సంపాదిస్తుంటారని చెప్పుకొంటారు. రాజు తర్వాత సమాజం పూజించేది కవి పండితులను, నాట్యకారులను అని చెప్పుకొన్నా.. అది జనాభాలో పది శాతమే. తొంభైశాతం జనాభా కళలను ఆరాధిస్తారు కానీ, కళాకారులు కావడానికి వారికి సమయం లేదు. ముఖ్యంగా వాణిజ్యంతో, వ్యవసాయంతో సంపద్వంతమైన వెలనాడు లాంటి రాజ్యాలలో.

**"గొడ్లను మేపుకోవాలి. పొలంలో బోలెడు పని ఉంది!"..**

"ఉప్పుడు కాదు. నాయన ఊరుకోడు.. తంతాడు!"..

ఈ సమాధానాలే.. ఎవ్వర్ని అడిగి చూసినా!

తెలతెలవారుతున్నది. వెచ్చని ఉషోదయ పవనాలు గోరింటాకు వర్ణపు భానుకిరణాలను తెచ్చి నిద్రిస్తున్న జాయపుని బుగ్గలకు గోరింటాకు పెడుతున్నాయి. దగ్గరగా ఓ గాత్రం.. తంబుర నాదంతో మేళవించి.. వీధివీధంతా ప్రతిధ్వనిస్తున్నది.

**శివా.. శివోహం! కేశవా.. నమోహం!!**

శివ కేశవులకు భేదమా.. సుజ్ఞానవంతులకు వాదమా..
శివా.. శివోహం! కేశవా.. నమోహం!!
పులిచర్మము కట్టే లింగడు.. పట్టు వస్త్రాలు కట్టే రంగడు..
ప్రేమ బూడిద రాసే లింగడు..
పట్టె నామాలెట్టే రంగడు.. ? శివ ?
ఎద్దు నెక్కినవాడు లింగడు.. గ్రద్ద నెక్కినవాడు రంగడు..
పాము పాగా చుట్టే లింగడు.. పాముపైనే పవ్వళించె రంగడు..
? శివ ?
కైలాసగిరి పైన లింగడు.. వైకుంఠపురమందు రంగడు..
శివ కేశవులకు భేదమా.. సుజ్ఞానవంతులకు వాదమా..
శివా.. శివోహం!.. కేశవా.. నమోహం!!

చెళ్లున చరచినట్లయ్యింది. లేచి వేగంగా బయటికి వచ్చాడు. ఓ భిక్షుక గాయకుడు.. తలకు తలపాగా, చిరుగుల కంచుకం, భుజాన జోలె, ముఖాన నిలువు అడ్డబొట్లు, వెలుగుతున్న గరుడ కమ్మి (ఎత్తుదీపం) ఓ చేతిలో, మెడలో పెరికెతాడు కట్టిన ఇత్తడి పళ్లెరంపై కర్రతో శబ్దం చేస్తూ ఇల్లిల్లూ తిరుగుతూ.. భిక్షాటనతో దీవెనలు ఇస్తూ పాడుకుంటూ పోతున్నాడు. హరిహర తత్వగీతం!.. తెలుగు ప్రాంతాలలో వేగంగా విస్తరిస్తున్న మరో మతకోణం! తిక్కనామాత్యులు తదితరులు తీవ్రంగా ప్రచారం చేస్తున్నారని విన్నాడు. అరె.. ఈ అంశం తెలిసినా ఎలా తన మనసు నుంచి తప్పుకొన్నది!? అతని వెనకే వెళ్లి ఆ తత్వగీతం పూర్తిగా విన్నాడు. "ఆయన మాల దాసరిగాడు. భలే భలే పాటలు కడతాడు!".. జాయపుని ఆశ్చర్యం చూసి పొదుంపుల్ల నోట్లో పెట్టుకున్న పొరుడొకడు వివరణ ఇచ్చాడు. కాస్త ఆవలగా ఇలాగే ఏదో పాడుకుంటూ మరొక దాసరి.. దూరంగా మరొకడు. అక్కడెక్కడో మరో దాసరి గీతం! కాస్త పులకింత కలిగింది జాయపునికి. "అతడు.. ఆ దాసరి ఎక్కడుంటాడు?" అడిగాడా పొదుంపుల్లను. "అటు పో.. గడ్డిపాడు దాటిపో! ఆడ పెద్ద రాయిసెట్టు ఉంటది. ఆడ గుడిసెలుంటయ్. అందరూ దాసరిగాళ్లే! ఇప్పుడంతా అడుక్కోడానికి పోతారు. పొద్దుగుంకే యాలకు వత్తారు!". రోజంతా అస్థిమితంగా గడిపి పొద్దుగుంకే వేళకు గడ్డిపాడు అవతలనున్న ఆ రావిచెట్టు వద్దకు వెళ్లాడు. ఉప్పెన సమయంలో నిలిచిన నీటిచలమ ఎండిపోగా.. తిరిగి తేలిన మెరక నేల అది. సంచారజాతుల చిన్నచిన్న తాత్కాలిక గుడిసెలు. ఆడవాళ్లూ, పిల్లలూ ఉన్నారు. మగవాళ్లు ఎవ్వరూ లేరు. గ్రామ భిక్షాటన నుంచి రాలేదనుకుంటా. రావిచెట్టు మొదట్లోనున్న దిమ్మెపై కూర్చున్నాడు. జాయపునిలాంటి ఆకర్షణీయ విగ్రహం అక్కడ కనిపించడం ఆ మహిళలకు అబ్బురంగా ఉంది. గుడిసెల్లోంచి తొంగి చూస్తున్నారు. అది అలవాటైన జాయపుడు తలవొంచుకుని కూనిరాగం తీస్తూ కూర్చున్నాడు. కాస్త అవతలగా మరో రావిచెట్టు. దాని మొదట్లో చిన్నగూడులా ఓ గుడి. అందులోంచి ఎవరో గ్రామదేవత అనుకుంటా.. దూరానికి కూడా పెద్దపెద్ద కళ్లు.. జాయపుణ్నే చూస్తున్నట్లు. రానురానూ చీకటి ముసురుకుంటున్నది. ఎవరో మహిళ దైవప్రార్థన చేయడం వినిపించింది. ఆశ్చర్యంగా అటు చూశాడు. ఆ గ్రామదేవత ముందు ఓ వృద్ధ మహిళ పాడుతున్నది.

**శివశక్తే నమస్తుభ్యం!!**

కళాభ్యాం చూడాలంకృత శశికళాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతుమే
శివాభ్యాం అస్తోక త్రిభువన శివాభ్యాం హృదిపున
ర్భవాభ్యాం ఆనంద స్ఫురదనుభవాభ్యాం నతిరియమ్ ?

చటుక్కున లేచి చూశాడు. ఆమె ఆ చిన్నగుడి ముందు చీపురుతో ఊడుస్తూ పాడుతున్నది. పూచికపుల్ల లాంటి వడలిన శరీరం. కానీ కంఠం మాత్రం ఖంగున మోగుతున్నది. ఉద్వేగంతో కూడిన శ్రావ్యత.. ఆ గొంతులో చిప్పిల్లుతున్నది. గుడిసెల్లోని స్త్రీలు బయటికి వచ్చి నిలబడ్డారు.. భక్తిగా చేతులు జోడించి. ఆమె సాయంకాలపు రంగపూజనం నిర్వహిస్తున్నది. చేతులు వెనక్కి కట్టుకుని వింటూ.. అటుగా నడవసాగాడు. ఊడ్చాక వెంట తెచ్చుకున్న కడవలోని నీళ్లతో కడిగింది. ముగ్గులేసింది. అన్ని సంస్కృత భక్తిగీతాలు. ప్రతిపదానికీ అర్థం తెలిసినట్లు.. మనోధర్మంతో తాదాత్మ్యతతో తడుముకోకుండా పాడుతున్నది. స నుంచి ని వరకు.. అంటే సంగీతం పూర్తిగా తెలిసినవారే.. సాని. ఆమె గుడిసాని కావచ్చు. పాడుతూనే చీర కొంగు నడుంవద్ద దోపి నాట్యానికి సిద్ధమై భంగిమ తీసుకుంది. అప్పుడెప్పుడో కాకతి ఉదయ భోగాలు నిర్వహిస్తుండగా చూశాడు. ఇప్పుడు.. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ సంధ్యా భోగం సమర్పిస్తుండగా చూస్తున్నాడు. చూపు ఆ చిన్నగుడిలోని దేవుడిపైకి పోయింది. చిత్రంగా ఆ దైవరూపం చుట్టూ ఏదో వెలుగు.. చిరుకంపన. పిచ్చెక్కిపోయింది జాయపునికి. నిస్సందేహంగా ఆ దేవుడు ఆమె సమర్పణకు స్పందిస్తున్నాడు. పులకిస్తున్నాడు.

# ర్యాలీ.. సాగేనా. ఆగేనా..

**మార్కెట్‌నిపుణులు ఏమంటున్నారు దేశీయ మార్కెట్‌లో బంగారం,**

**వెండి ధరలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నాయి.**

**గత ఏడాది 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ**

**రూ.58,750 ఎగిసింది.**

**ఇక కిలో వెండి రేటు రూ.1,49,300 ఎగబాకింది.**

ర్యాలీ.. సాగేనా. ఆగేనా.. మార్కెట్‌నిపుణులు ఏమంటున్నారు 2026లో బంగారం, వెండి ధరల దారెటు దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నాయి. గత ఏడాది 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.58,750 ఎగిసింది. ఇక కిలో వెండి రేటు రూ.1,49,300 ఎగబాకింది. ఈ క్రమంలో ఆల్‌టైమ్ హై రికార్డులూ నెలకొన్నాయి. అయితే ఈ ఏడాదీ ఇదే జోరు కొనసాగుతుందా? లేదా? అన్న డైలమాలో ఇప్పుడు మదుపరులున్నారు. **ఇదీ సంగతి..**బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న సాంకేతిక అంశాలను పరిశీలిస్తే.. ద్రవ్యోల్బణం పెరిగి, అంతర్జాతీయంగా ఉద్రిక్తకర పరిస్థితులే కొనసాగితే రేట్లు ఇంకా విజృంభిస్తాయని నిపుణులు చెప్తున్నారు. స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనైతే మదుపరులు తమ పెట్టుబడులను బంగారం, వెండి వైపునకు మళ్లిస్తారని.. ఇది కూడా ధరలను ఎగదోస్తుందని అంటున్నారు. అయితే అమెరికా డాలర్ బలపడి, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు తగ్గితే మాత్రం ధరల్లో దిద్దుబాటుకు అవకాశం ఉన్నదని చెప్పవచ్చు. కానీ సెంట్రల్ బ్యాంకులతోపాటు భారతీయులు, చైనీయులు బంగారం కొనుగోళ్లను కొనసాగిస్తారు కాబట్టి మన పెట్టుబడులు సురక్షితమేనన్న అభిప్రాయాలనూ వెలిబుచ్చుతున్నారు. ఇక వెండికి పరిశ్రమల నుంచి డిమాండ్ ఉంటుందని, ఆశించిన స్థాయిలో మార్కెట్‌కు సరఫరా కష్టమేనని అంటున్నారు. దీంతో ముందుందూ వెండి ధరలు పరుగులు పెట్టడం ఖాయమేనన్న అంచనాలనైతే వేస్తున్నారు. అయినప్పటికీ మదుపరులు ఒడిదుడుకులకు సిద్ధంగా ఉండాల్సిన అవసరమే ఉన్నదని హెచ్చరిస్తున్నారు. **గోల్డ్, సిల్వర్ ర్యాలీకి కారణం** అమెరికాలో వడ్డీరేట్ల కోతలు: ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీరేట్లను గత ఏడాది 3.50-3.75 శాతానికి తగ్గించింది. దీంతో అమెరికా కరెన్సీ డాలర్ బలహీనపడింది. ఫలితంగా ఇతర దేశాలు బంగారాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేశాయి. మార్కెట్‌లో పెరిగిన డిమాండ్ ధరలను పరుగులు పెట్టించింది.అంతర్జాతీయ ఆందోళనలు: మిడిల్ ఈస్ట్‌లో సంఘర్షణలు, రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు.. మదుపరులలో భయాలను పెంచాయి. స్టాక్ మార్కెట్ వంటి రిస్కీ పెట్టుబడులకు దూరం జరిగి.. బంగారం వంటి సురక్షిత పెట్టుబడులకు దగ్గరయ్యారు. ఇది రేట్లను ఎగదోసింది.సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు: భారత్ సహా ఆయా దేశాల రిజర్వ్ బ్యాంకులు.. బంగారాన్ని పెద్ద ఎత్తున కొంటున్నాయి. అంతర్జాతీయ ఒడిదుడుకులను తట్టుకునేందుకు రక్షణ కవచంగా గోల్డ్ రిజర్వులను పెంచుకుంటున్నాయి. దీంతో పసిడి మరింతగా ప్రియమవుతున్నది.వెండికి పారిశ్రామిక డిమాండ్: వెండిని సోలార్ ప్యానెల్స్, విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) తయారీలో విరివిగా



ఉపయోగిస్తున్నారు. ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలోనూ వెండిది కీలకపాత్రే. దీంతో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా లభ్యత లేకపోవడంతో మార్కెట్‌లో వెండి ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. అలాగే వెండిని అమెరికా 'క్రిటికల్ మినరల్'గా వర్గీకరించింది. మరోవైపు చైనా వెండి ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఇక సాధారణ కొనుగోలుదారులతోపాటు మదుపరులు వెండిని పెట్టుబడి సాధనంగా ఎంచుకుంటున్నారు. ఇది కూడా ధరలను ఎగదోస్తున్నది.**గత ఐదేండ్ల తీరిది..**వెండి: 2020 డిసెంబర్‌లో కిలో వెండి ధర రూ.65,604గా ఉన్నది. ఇప్పుడు రూ.2,50,000. దీంతో ఐదేండ్ల కిందట లక్ష రూపాయలను పెట్టుబడిగా పెడితే.. నేడు దాని విలువ దాదాపు రూ.3.75 లక్షలు. మదుపరులకు దాదాపు 300 శాతం లాభాలున్నాయి. 2024 ముగింపుతో చూస్తే 2025లో వెండి రేటు 190 శాతం పెరిగింది.బంగారం: 2020 డిసెంబర్‌లో 10 గ్రాముల బంగారం రేటు రూ.49,712. ఇప్పుడు రూ.1,41,700. ఫలితంగా ఐదేండ్ల కిందట లక్ష రూపాయలను పెట్టుబడిగా పెడితే.. ఇప్పుడు దాని విలువ సుమారు రూ.2.84 లక్షలు. ఇన్వెస్టర్లకు ఇంచుమించుగా 190 శాతం లాభాలున్నాయి. 2024 ఆఖరుతో పోల్చితే 2025లో బంగారం విలువ 80 శాతం ఎగిసింది. నిఫ్టీ 50: స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపైనా మదుపరులు బాగానే ఆర్జించారు. అయితే బంగారం, వెండిలతో పోల్చితే మాత్రం తక్కువేనని చెప్పవచ్చు. 2020లో నిఫ్టీ 50 ఇండెక్స్‌లో లక్ష రూపాయలను పెట్టుబడిగా పెట్టినైట్టైతే.. అదిప్పుడు దాదాపు రూ.1.94 లక్షలుగా ఉన్నది. గత ఏడాది నిఫ్టీ సూచీ దాదాపు 8-9 శాతం పుంజుకున్నది.

# ఇండియన్ టెకీలకు గుడ్ న్యూస్

**హోల్డర్స్‌కు కెనడా ఫాస్ట్ ట్రాక్ వీసాలు!**

**అమెరికాలోని 'హెచ్-1బీ' వీసాదారులకు కెనడా రెడ్ కార్పెట్**

**ఫాస్ట్ ట్రాక్ వీసాల జారీకి కెనడా సమాయత్తం**




అమెరికాలో ఉద్వాసనలు, ప్రతికూల పరిణామాలను ఎదుర్కొంటున్న వేలాది మంది భారతీయ టెక్ నిపుణులకు కెనడా గుడ్ న్యూస్ వినిపించింది. అమెరికాకు చెందిన హెచ్-1బీ వీసాలను కలిగిన విదేశీ టెకీల కోసం ఫాస్ట్ ట్రాక్ వీసా మార్గాన్ని కెనడా ఆవిష్కరించింది. ఈ విషయాన్ని ఫెడరల్ బడ్జెట్-2025లో కెనడా సర్కారు ప్రతిపాదించింది. అగ్రరాజ్యం అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ సర్కారు కఠినతర వలస విధానాల వల్ల ప్రతికూలంగా ప్రభావితులైన విదేశీ నిపుణులను ఆకర్షించాలని కెనడా లక్ష్యంగా పెట్టుకుంది. కెనడా ప్రభుత్వానికి చెందిన 'అంతర్జాతీయ నిపుణులను ఆకర్షించే వ్యూహం'లో భాగంగా ఈ కొత్త ప్రణాళికను అమలు చేయనున్నారు. తద్వారా కెనడాలోని వివిధ సాంకేతిక రంగాల్లో నిపుణుల కొరతను తగ్గించనున్నారు. పరిశోధనలను ప్రోత్సహించేందుకు, ఆవిష్కరణలు చేసే పరిశ్రమలను బలోపేతం చేసేందుకు ఈ విధానం దోహదం చేస్తుందని భావిస్తున్నట్లు కెనడా ప్రభుత్వ బడ్జెట్ డాక్యుమెంట్‌లో ప్రస్తావించారు.**విదేశీ పరిశోధకుల భర్తీకి రూ.10,370 కోట్లు** ఆరోగ్య సంరక్షణ రంగంలో నిపుణుల అంతర్జాతీయ హబ్‌గా తమ దేశాన్ని నిలపాలని కెనడా భావిస్తోంది. రీసెర్చ్, అడ్వాన్స్‌డ్ పరిశ్రమల్లోనూ అంతర్జాతీయంగా కీలక స్థానాన్ని పొందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో విదేశాలకు చెందిన పరిశోధకులు, పీహెచ్‌డీలు చేసేవారు, పోస్ట్ డాక్టోరల్ ఫెల్లోలకు జారీ చేసే 'ఫారిన్ క్రెడెన్షియల్ రికగ్నిషన్' ప్రక్రియను సైతం కెనడా క్రమబద్ధీకరించనుంది. 1000 మందికిపైగా విదేశీ పరిశోధకులను భర్తీ చేసుకునేందుకు దాదాపు రూ.10,370 కోట్లను కెనడా ప్రభుత్వం పెట్టుబడి పెట్టనుందని తెలుస్తోంది. **భవిష్యత్ కోసం కెనడా భారీ కేటాయింపులు** కెనడాలోని ప్రధాన పరిశోధనా సంస్థలైన ఎన్ఎస్ఈఆర్సీ, ఎస్ఎస్‌హెచ్‌ఆర్సీ, సీఐహెచ్ఆర్ కొత్త 'యాక్సిలరేటెడ్ రీసెర్చ్ ఛైర్స్ ప్రోగ్రాం'లను ప్రారంభించనున్నాయి. వీటికోసం రాబోయే 13 ఏళ్లలో కెనడా సర్కారు రూ.6,300 కోట్లను కేటాయించనుంది.'కెనడా ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్' ద్వారా దేశంలోని పరిశ్రమల్లో అధునాతన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెచ్చేందుకు రాబోయే 7 ఏళ్లలో రూ.2,500 కోట్లను వెచ్చించనున్నారు.విదేశాలకు చెందిన పీహెచ్‌డీ విద్యార్థులు, పోస్ట్ డాక్టోరల్ ఫెల్లోలను కెనడాకు ఆహ్వానించేందుకు రాబోయే మూడేళ్లలో రూ.839 కోట్లను ఖర్చు చేయనున్నారు.విదేశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను కెనడాలోని యూనివర్సిటీలు భర్తీ చేసుకునేందుకు రాబోయే 12 ఏళ్లలో రూ.757 కోట్లను వెచ్చించనున్నారు.2026-2027 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు రూ.612 కోట్లను కొత్తగా ఏర్పాటయ్యే 'ఫారిన్ క్రెడెన్షియల్ రికగ్నిషన్ యాక్షన్ ఫండ్'కు కేటాయించనున్నారు. తద్వారా విదేశీ నిపుణులు కెనడాలో స్థిరపడేందుకు వేగంగా అనుమతులు ఇస్తారు. ప్రత్యేకించి ఆరోగ్య సంరక్షణ, నిర్మాణ రంగాల్లో వారికి ప్రాధాన్యత లభిస్తుంది.**అమెరికా కఠిన విధానాలతో కెనడాకు ప్రయోజనం**తమ విధానాల వల్ల దేశంలో మానవ వనరుల కొరత తగ్గడంతో పాటు అమెరికా అనుసరిస్తున్న కఠిన వీసా విధానాల నుంచి ప్రయోజనం దక్కుతుందని కెనడా భావిస్తోంది. విదేశీ నిపుణులకు సులభ మార్గంగా తమ దేశం నిలవాలని కెనడా కోరుకుంటోంది. గతంలో ఈవిషయాన్ని స్వయంగా కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ కూడా పలుమార్లు చెప్పారు.**ట్రంప్ అప్పట్లోనే సినిమా చూపించారు!**"కెనడా గొప్ప నిర్ణయం తీసుకుంది. నా ఒకేఒక్క ఆందోళన ఏమిటంటే, ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు కూడా ఇదే సినిమాను మేం చూశాం. అప్పట్లోనూ ఫాస్ట్ ట్రాక్ పీఆర్ ప్రోగ్రాంను కెనడా ఆరంభించింది. అకస్మాత్తుగా అమెరికా కంపెనీల్లో పనిచేస్తున్న వేలాది మంది హెచ్-1బీ వీసాదారులు సబ్ కాంట్రాక్టుల ద్వారా కెనడాకు వచ్చి పనిచేయడం మొదలుపెట్టారు. అది కెనడా ఆర్థిక వ్యవస్థకు కలిసొచ్చింది. అమెరికాలో మాత్రం నిపుణుల కొరత ఏర్పడింది. కానీ ఈ విధానం హెచ్-1బీ తరహా వీసాలను వ్యతిరేకించే వాళ్లను శాంతింపజేయగలదా?" అని పేర్కొంటూ జేమ్స్ బ్లంట్ ఓ ట్వీట్ చేశారు. **హెచ్-1బీ వీసాదారులకు కెనడా ఓపెన్ వర్క్ పర్మిట్లు**"అమెరికాలోని హెచ్-1బీ వీసాదారులకు కెనడా మళ్లీ ఓపెన్ వర్క్ పర్మిట్లను ఇవ్వనుంది. కెనడా వార్షిక బడ్జెట్‌లో దీనిపై ప్రకటన చేశారు. 2023 జులైలోనూ మూడేళ్ల కాల పరిమితి కలిగిన 10వేల వర్క్ వీసాలను హెచ్-1బీ వీసాదారులకు కెనడా జారీ చేసింది" అని రెగ్యులేటెడ్ కెనడియన్ ఇమిగ్రేషన్ కన్సల్టెంట్ (ఆర్సీఐసీ) డాక్టర్ గౌతమ్ కొల్లూరి పేర్కొన్నారు.

# ఫోన్‌పే నుంచి అదిరిపోయే ఫీచర్

**ఇకపై సీవీవీ కొట్టక్కర్లేదు**

**చిటికెలో పేమెంట్స్!**

**'ఫోన్‌పే పీజీ బోల్ట్' పేరుతో కొత్త సేవలు**

**వీసా, మాస్టర్ కార్డ్ యూజర్లకు పండగే**

**కార్డు వివరాలు సేవ్ చేస్తే చాలు**

**పేమెంట్ గేట్‌వేలో విప్లవాత్మక మార్పులు**

**ఒక్క క్లిక్‌తో చెల్లింపులు పూర్తి**

డిజిటల్ చెల్లింపుల దిగ్గజం ఫోన్‌పే తన వినియోగదారులకు మరో శుభవార్త చెప్పింది. ఆన్‌లైన్ పేమెంట్స్‌ను మరింత వేగవంతం చేసేందుకు శనివారం 'ఫోన్‌పే పీజీ బోల్ట్' పేరుతో సరికొత్త ఫీచర్‌ను లాంచ్ చేసింది. ఇకపై వీసా, మాస్టర్ కార్డ్ వినియోగదారులు ప్రతిసారీ తమ కార్డు సీవీవీ నంబర్‌ను ఎంటర్ చేయాల్సిన అవసరం లేదు. కేవలం ఒక్క క్లిక్‌తోనే అత్యంత సురక్షితంగా పేమెంట్స్ పూర్తి చేయవచ్చు. వినియోగదారుల సమయాన్ని ఆదా చేయడంతో పాటు, చెల్లింపుల వైఫల్యాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్లు కంపెనీ ప్రకటించింది.**అసలేంటీ ఈ 'బోల్ట్' ఫీచర్** ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే తీసుకొచ్చిన ఈ కొత్త ఫీచర్ 'డివైజ్ టోకనైజేషన్'(సురక్షితమైన డిజిటల్ చెల్లింపులు) అనే అధునాతన టెక్నాలజీపై పనిచేస్తుంది. వీసా, మాస్టర్ కార్డ్ క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను వాడుతున్న కస్టమర్ల కోసం దీనిని రూపొందించారు. ఫోన్‌పే యాప్‌లో మీ కార్డు వివరాలను ఒక్కసారి సేవ్ చేసుకుంటే చాలు. ఆ తర్వాత ఫోన్‌పే పేమెంట్ గేట్‌వేను




ఉపయోగించే ఏ మర్చంట్ యాప్‌లో అయినా సరే, మళ్లీ కార్డు వివరాలు నమోదు చేయాల్సిన పనిలేదు. ముఖ్యంగా పేమెంట్ చేసే ప్రతిసారీ సీవీవీ నంబర్ వెతుక్కుని టైప్ చేసే తిప్పలు తప్పుతాయి. **ఒకే ఒక్క క్లిక్, సూపర్ ఫాస్ట్ పేమెంట్**సాధారణంగా ఆన్‌లైన్ పేమెంట్ చేసేటప్పుడు అనేక దశలు ఉంటాయి. కానీ 'బోల్ట్' వల్ల ఇవన్నీ సులభం కానున్నాయి. కార్డు వివరాలను సురక్షితమైన టోకెన్లుగా మారుస్తారు. దీనివల్ల మీరు అదే డివైజ్ నుంచి పేమెంట్ చేసేటప్పుడు మళ్లీ సీవీవీ అడగదు. పేమెంట్ చేసేటప్పుడు వేరే పేజీకి రీ-డైరెక్ట్ అవ్వడం, అక్కడ బ్యాంక్ సర్వర్ డౌన్ అవ్వడం వంటి సమస్యలు ఇక ఉండవు. మర్చంట్ యాప్‌లోనే ఉండి లావాదేవీని క్షణాల్లో పూర్తి చేయవచ్చు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, పేమెంట్స్ ఫెయిల్ అయ్యే ఛాన్స్ చాలా తక్కువగా ఉంటుంది.**కంపెనీ ఏమంటోందంటే**ఈ కొత్త ఫీచర్ గురించి ఫోన్‌పే మర్చంట్ బిజినెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "కోట్లాది మంది భారతీయులకు డిజిటల్ చెల్లింపులను సులభతరం చేయాలనే మా ప్రయాణంలో ఇదో కీలక ముందడుగు. పాత పద్ధతిలో పేమెంట్స్ చేయడం కాస్త చికాకుగా, ఆలస్యంగా ఉండేది. ఇప్పుడు 'టోకనైజేషన్' ద్వారా వన్-క్లిక్ పేమెంట్ అనుభవాన్ని అందిస్తున్నాం. ఇది వినియోగదారులకు సౌకర్యంగా ఉండటమే కాదు, వ్యాపారులకు కూడా ఎంతో మేలు చేస్తుంది. పేమెంట్స్ ఫెయిల్ కాకపోవడం వల్ల వ్యాపారం పెరుగుతుంది" అని ఆయన పేర్కొన్నారు.**వ్యాపారులకు లాభమేంటి**కేవలం వినియోగదారులకే కాదు, ఆన్‌లైన్ వ్యాపారులకు కూడా ఈ ఫీచర్ వరం లాంటిది. చాలామంది కస్టమర్లు పేమెంట్ పేజీకి వచ్చాక, ప్రాసెస్ లేట్ అవుతోందని క్యాన్సిల్ చేసి వెళ్లిపోతుంటారు. ఈ కొత్త ఫీచర్ వల్ల పేమెంట్స్ వేగంగా జరిగిపోతాయి. ఫోన్‌పే నేటివ్ ఎస్‌డీకేను ఉపయోగించడం వల్ల లావాదేవీల సక్సెస్ రేట్ భారీగా పెరుగుతుంది. మాన్యువల్‌గా కార్డు నంబర్లు ఎంటర్ చేసే పనిలేదు కాబట్టి తప్పులు జరిగే అవకాశం ఉండదు. వ్యాపారులు తమ యాప్‌కు తగినట్లుగా ఈ పేమెంట్ ఇంటర్‌ఫేస్‌ను మార్చుకునే వెసులుబాటు కూడా ఉంది. మొత్తానికి ఫోన్‌పే తెచ్చిన ఈ 'బోల్ట్' ఫీచర్ రాబోయే రోజుల్లో ఆన్‌లైన్ షాపింగ్, బిల్లు చెల్లింపుల విధానాన్ని పూర్తిగా మార్చేయనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 'సిమ్‌కార్డు ఉంటేనే యాప్ పనిచేయాలి'




**మెసేజింగ్ యాప్స్‌కు కేంద్రం కీలక ఆదేశాలు**

**తదుపరి సిమ్‌కార్డుతో కనెక్ట్ అయ్యేలా చూడాలని సూచన**

**మెసేజింగ్ యాప్స్ దుర్వినియోగం కాకుండా చూడటమే లక్ష్యం**

వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి కమ్యూనికేషన్ యాప్స్‌కు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. డివైజ్‌లో సిమ్‌కార్డు ఉంటేనే యాప్ పనిచేసేలా చూడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ఆదేశించింది. టెలికమ్యూనికేషన్ సైబర్ సెక్యూరిటీ సవరణ నిబంధనలు, 2025లో భాగంగా యాప్ ఆధారిత కమ్యూనికేషన్ సేవలందించే సంస్థలకు ఈ మేరకు డాట్ ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనలను అమలు చేయాలని పేర్కొంది. కమ్యూనికేషన్ యాప్స్‌ను టెలి కమ్యూనికేషన్ ఐడెంటిఫైర్ యూజర్ ఎంటిటీస్‌గా పేర్కొంటారు. ఇకపై ఆయా సంస్థలు తమ సేవలను తదుపరి 90రోజుల్లో సిమ్‌కార్డుతో అనుసంధానమయ్యేలా చూసుకోవాలి. యూజర్ ఏ సిమ్‌తో అయితే యాప్‌లో అకౌంట్ రిజిస్టర్ చేశారో, ఆ సిమ్ మాత్రమే ఆ ఫోన్‌లో ఉంటేనే యాప్ పని చేస్తుంది. సిమ్ తీసేసినా లేదా ఫోన్ మార్చినా యాప్ ఆటోమాటిక్‌గా లాగౌట్ అవుతుంది. ఒకవేళ యూజర్ వెబ్ బ్రౌజర్ ద్వారా సేవలు పొందితే సదరు ప్లాట్‌ఫామ్ ప్రతి 6గంటలకు లాగౌట్ అయ్యేలా చూడాలి. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్‌కోడ్ ద్వారా లాగిన్ కావాలి.ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఒకవేళ సదరు డివైజ్ నుంచి సిమ్‌కార్డు తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. ఫలితంగా ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధనతో మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగం కాకుండా నిత్యం సిమ్ కార్డుతో అనుసంధానం అయ్యేలా చూడడం ఈ రూల్ ముఖ్య ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు. ఇకపై ఎవరైతే డీయాక్టివేట్ ఐన సిమ్‌కార్డుతో వాట్సప్ వంటి యాప్స్‌ను వినియోగిస్తున్నారో వారు కూడా ఈ నిబంధనతో సేవలు పొందలేరు.అయితే, కేంద్రం ప్రవేశపెట్టిన తాజా నిబంధనలను వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సంస్థలు ఎలా అమలు చేస్తాయో చూడాలి. ఎవరైతే డీయాక్టివేట్ అయిన సిమ్‌కార్డుతో వాట్సప్ వంటి యాప్స్‌ను వినియోగిస్తున్నారో వారు కూడా ఈ నిబంధనల వల్ల సేవలు పొందలేరు. ప్రస్తుతం యూపీఐ పేమెంట్ యాప్స్ ఆ ఫోన్‌లో సిమ్ ఉంటేనే సేవలు అందిస్తున్నాయి.**ఎవరి సిమ్ దుర్వినియోగమైతే వారిదే బాధ్యత : కేంద్రం** అంతకుముందు సోమవారమే సిమ్ కార్డులపై కీలక ఆదేశాలు జారీ చేసింది టెలికాం విభాగం (డాట్). సైబర్ మోసాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో ఏ సిమ్ కార్డు (మొబైల్ నంబరు) అయినా దుర్వినియోగం అయితే ఆ సిమ్ ఎవరి పేరిట ఉంటే వారే బాధ్యులవుతారని స్పష్టం చేసింది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ట్యాంపర్ చేసిన ఐఎమ్ఈఐ నంబర్లు ఉండే మొబైళ్లను వినియోగించొద్దని తెలిపింది. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి /ఇతరుల పేరిట సిమ్ కార్డులు తీసుకోరాదని హెచ్చరించింది. ముఖ్యంగా మీ పేరిట తీసుకున్న సిమ్ కార్డులను ఇతరులకు ఇవ్వరాదని, ఇలా చేయడం వల్ల వారు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని పేర్కొంది.


# భారత్ బయోటెక్‌తో పాండోరమ్ టెక్నాలజీస్ భాగస్వామ్యం

**న్యూసెలియన్ థెరప్యూటిక్స్ సామర్థ్యాలను పెంపొందించేందుకే!**

**ఆసియా పసిఫిక్ మార్కెట్లలో కంటి వ్యాధులకు ఎక్సోసోమ్**

**ఆధారిత కణజాల పునరుత్పత్తి చికిత్సను అందించడమే లక్ష్యం**

భారత్ బయోటెక్ అనుబంధ సంస్థ న్యూసెలియన్ థెరప్యూటిక్స్ ప్రస్తుతం క్లినికల్ దశలో ఉన్న ఔషధ సంస్థ పాండోరమ్ టెక్నాలజీస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రోగ్రామబుల్ కణజాల పునరుత్పత్తికి కృషి చేస్తున్న న్యూసెలియన్‌తో పరస్పరం వ్యూహాత్మక సహకారం అందించుకోనున్నట్లు మంగళవారం ప్రకటించింది. ప్రస్తుతం పాండోరమ్ సంస్థ క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్న నేపథ్యంలోనే వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఒప్పందం చేసుకున్నారు. న్యూసెలియన్ థెరప్యూటిక్స్ సంస్థ తయారీ సామర్థ్యాలను పెంచడంతో పాటు ప్రాంతీయ సరఫరా, నియంత్రణకు సహకరిస్తుంది. అంతేకాకుండా అత్యాధునిక జీవ చికిత్సల అభివృద్ధిలో భారత సామర్థ్యాన్ని ఇది పెంపొందిస్తుంది. ముఖ్యంగా ఆసియా పసిఫిక్ మార్కెట్లలో కంటి వ్యాధులకు ఎక్సోసోమ్-ఆధారిత కణజాల పునరుత్పత్తి చికిత్సను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి."కంటి వ్యాధులకు చికిత్సలో వినూత్నంగా ఎక్సోసోమ్-ఆధారిత కురాజెంక్స్ అభివృద్ధిపై కృషి చేస్తున్న పాండోరం టెక్నాలజీస్‌తో భాగస్వామ్యం చేసుకోవడానికి సంతోషిస్తున్నాం. మా అధునాతన తయారీ ప్లాంట్‌లు, నాణ్యమైన వ్యవస్థలు సంక్లిష్టమైన బయోలాజిక్స్ ఇందుకు మద్దతు ఇస్తాయి. ముఖ్యంగా ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని రోగులకు పాండోరం సంస్థకు చెందిన డిజైనర్ ఎక్సోసోమ్ ఆధారిత ఉత్పత్తిని ప్రారంభించడానికి ఎదురుచూస్తున్నాం."**డాక్టర్ రఘు మలపాక, న్యూసెలియన్ థెరప్యూటిక్స్ జిదీూ** మరోవైపు రెండు సంస్థల సహకారంపై భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం దీ×=ూజ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర కుమార్ స్పందించారు. అధునాతన చికిత్సా విధానాలను రూపొందించడానికి పాండోరం-న్యూసెలియన్ వ్యూహాత్మక సహకార ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. ఇవి ప్రపంచ క్లినికల్ అవసరాలను తీర్చడానికి ఇంకా ఇన్నోవేట్ ముఖ్యంగా మేక్ ఇన్ ఇండియా వైపునకు పురోగమిస్తున్నాయని చెప్పారు."న్యూసెలియన్ థెరప్యూటిక్స్ అధునాతన బయోలాజిక్స్ తయారీలో బలమైన నైపుణ్యాన్ని కలిగి ఉంది. ఇంకా ప్రపంచవ్యాప్తంగా రోగులకు అందించే ప్రోగ్రామబుల్ ఎక్సోసోమ్ చికిత్సలను అందిస్తుంది. ఇది మా దీర్ఘకాలిక దృష్టికి బాగా సరిపోయే మంచి వాతావరణాన్ని తెస్తుంది."**డాక్టర్ తుహిన్ భౌమిక్, పాండోరం టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ** ప్రస్తుతం స్టీవెన్స్-జాన్సన్ సిండ్రోమ్ (ూజీూ), న్యూరోట్రోఫిక్ కెరాటిటిస్‌తో సహా కంటి ఉపరితల గాయం, ఇన్ఫ్లమేటరీ కార్నియల్ వ్యాధులకు చికిత్సలు ఉన్నాయి. భవిష్యత్తులో వాపు, వాస్కులర్ పాథాలజీలు, ఫైబ్రోసిస్ ద్వారా ప్రభావితమైన చర్మం, పల్మనరీ, ఇతర అవయవ వ్యవస్థల్లో క్షీణత మార్పులను తిప్పికొట్టేందుకు పాండోరం తన చికిత్సలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ న్యూసెలియన్ థెరప్యూటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తన కార్యకలాపాలను గతేడాదిలో ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్‌వ్యాలీలో ప్రత్యేకంగా నిర్మించిన 30,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల ప్రాంగణంలో ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టు పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి సేవల (సీఆర్‌డీఎంఓ) విభాగానికి చెందిన ఈ సంస్థ ప్రధానంగా కణ, జన్యు చికిత్సల (సెల్, జీన్ థెరపీ) పై దృష్టి పెట్టింది. క్యాన్సర్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, అరుదైన జన్యు సంబంధ రుగ్మతలకు అత్యాధునిక చికిత్సల కోసం అవసరమైన విధానాలను, ఔషధాలను ఆవిష్కరించటం ఈ సంస్థ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది.



## నేను కేవలం కమర్షియల్ బొమ్మలా మిగిలిపోవాలని అనుకోలేదు..

టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి రెజీనా కసాండ్రా.. తన నటనతో, చురుకైన మాటలతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. అయితే, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేయాలనే ఉద్దేశంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మకు అక్కడ చేదు అనుభవాలు ఎదురయ్యాయి. 2019లో 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసాలగా' సినిమాతో హిందీ తెరకు పరిచయమైన రెజీనా, అక్కడి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి నిశ్శబ్ద పోరాటం చేస్తూనే ఉంది. తాజాగా.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తనకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకుంది. "నేను సౌత్ ఇండియా నుంచి వచ్చాననే కారణంతో నన్ను ఒక మూసలో బంధించారు. నిజానికి చాలామంది ఉత్తరాది వారికంటే నా హిందీ చాలా స్పష్టంగా ఉంటుంది. నేను హిందీ రాయగలను, చదవగలను, అనర్గళంగా మాట్లాడగలను. నా ప్రతి సినిమాకు నేనే సొంతంగా డబ్బింగ్ చెప్పుకుంటాను. అయినప్పటికీ, నన్ను అక్కడ ఒక పరాయి వ్యక్తిలా చూశారు" అని రెజీనా తన ఆవేదన వ్యక్తం చేసింది. కేవలం మాటలతోనే కాకుండా, కొందరు తమ ప్రవర్తనతో కూడా తనను తక్కువ చేసి చూపిస్తూ కించపరిచేవారని, ఇది తన మనసును ఎంతో గాయపరిచిందని ఆమె వాపోయింది. ముఖ్యంగా ఉత్తరాది నటీమణులు దక్షిణాది సినిమాల్లో సులభంగా పాత్రలు దక్కించుకుంటుంటే, దక్షిణాది నటీమణులు మాత్రం హిందీలో పంజాబీ లేదా నార్త్ ఇండియన్ పాత్రలు చేయలేరనే ముద్ర వేయడం అన్యాయమని ఆమె ప్రశ్నించింది.

## నన్ను రాజకీయాల్లోకి లాగొద్దు..



యాక్టర్ త్రిష తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నాగేంద్రన్ విజయ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ నటి త్రిష పేరును వివాదంలోకి లాగడం తీవ్ర దుమారం రేపింది. విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీపై విమర్శలు చేసే క్రమంలో, "విజయ్ ముందుగా త్రిష ఇంటి నుంచి బయటకు వచ్చి రాజకీయాలు చేయాలి" అంటూ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై నటి త్రిష సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. "గౌరవం లేని ప్రవర్తనను ఎప్పుడూ ప్రశ్నించాలి" అని పేర్కొంటూ ఆమె ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు ఇంత అసభ్యంగా, ఒక మహిళా నటి వ్యక్తిగత జీవితాన్ని కించపరిచేలా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య అని ఆమె మండిపడ్డారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును వాడుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని త్రిష ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై రాజకీయ వర్గాల నుంచి కూడా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. డీఎంకే ఎంపీ కనిమొళి, ఇతర మహిళా సంఘాల నేతలు నైనార్ నాగేంద్రన్ తీరును తప్పుబట్టారు. మహిళల పట్ల ఇలాంటి 'గుటర్ పాలిటిక్స్' (నీచ రాజకీయాలు) చేయడం బీజేపీ సంస్కృతికి నిదర్శనమని వారు విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కూడా త్రిషకు మద్దతుగా నిలుస్తూ, నాగేంద్రన్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, బీజేపీ శ్రేణులు మాత్రం ఈ వ్యాఖ్యలను ప్రత్యర్థి పార్టీలు కావాలనే వక్రీకరిస్తున్నాయని సమర్థించుకుంటున్నారు.



## హే బల్‌వంత్' లాంటి సినిమా కోసం ఎదురుచూశాను: హీరో సుహాస్

ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి', 'ఈషా' వంటి వరుస విజయాలను అందుకున్న సక్సెస్‌ఫుల్ ద్వయం బన్నీ వాస్, వంశీ నందిపాటి తాజాగా నిర్మించిన చిత్రం 'హే బల్‌వంత్'. గతంలో 'హే భగవాన్'గా ప్రకటించిన ఈ చిత్ర టైటిల్‌ను తాజాగా మార్చారు. నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై గోపీ అచ్చర దర్శకత్వంలో రూపొందిన ఈ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ఫిబ్రవరి 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సుహాస్ మంగళవారం పాత్రికేయులతో ముచ్చటించి, సినిమా విశేషాలను పంచుకున్నారు.

### టైటిల్ మార్పు వెనుక కారణం

టైటిల్ మార్పు గురించి సుహాస్ స్పందిస్తూ.. 'భగవాన్' అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది. సెన్సార్ సభ్యుల సూచనల మేరకు సినిమా కాన్సెప్ట్‌ను, టైటిల్‌ను పరిగణనలోకి తీసుకుని 'హే బల్‌వంత్'గా మార్చాం. ఇందులో భాగంగా సీనియర్ నటుడు నరేష్ గారి క్యారెక్టర్ పేరును కూడా మార్చడం జరిగింది" అని తెలిపారు. సినిమాలో తన పాత్ర గురించి సుహాస్ వివరిస్తూ.. ఇందులో నేను చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని తపించే కుర్రాడిగా కనిపిస్తాను. తన తండ్రి చేసే బిజినెస్‌ను తను టేకాఫ్ చేయాలనుకున్నప్పుడు ఎదురైన పరిణామాలు ఏమిటి? ఆ బిజినెస్ నేపథ్యం ఏంటి? అనే అంశాలను దర్శకుడు చాలా వినోదాత్మకంగా మలిచారు. నా కెరీర్ మొదట్లో షార్ట్ ఫిలింస్‌లో చేసిన తరహా కామెడీ ఈ సినిమాలో మళ్ళీ కనిపిస్తుంది అని సుహాస్ చెప్పారు.

### వేగంగా పూర్తయిన షూటింగ్

నా కెరీర్‌లో ఓకే అయిన వెంటనే షూటింగ్ పూర్తి చేసుకుని, అతి త్వరితగతిన విడుదలకు సిద్ధమైన సినిమా ఇది. తక్కువ వర్కింగ్ డేస్‌లో పూర్తి చేసినప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. మళ్ళీ నా కెరీర్‌లో ఇంత ఫాస్ట్‌గా ఒక సినిమా జరుగుతుందా? అనిపించేంత వేగంగా ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యింది అని పేర్కొన్నారు.

### సక్సెస్ పై నమ్మకం

గత సినిమాల ఫలితాలపై స్పందిస్తూ.. విజయం కోసం ఎదురుచూడటం కొంత బాధగా అనిపించినా, వెంటనే తదుపరి సినిమాకు సిద్ధమవుతాను. వరుస సినిమాల తర్వాత కొంచెం గ్యాప్ తీసుకుని, మంచి కథ కోసం వేచి చూసి ఈ సినిమా చేశాను. వంశీ నందిపాటి గారు మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నారు. మా ఆవిడ కూడా సినిమా చూసి, 'నువ్వు చేయాల్సింది ఇలాంటి సినిమాలే' అని మెచ్చుకుంది. ఈ సినిమా నాకు తప్పకుండా విజయాన్ని అందిస్తుందనే నమ్మకం ఉంది అని ధీమా వ్యక్తం చేశారు. తమిళ చిత్రం 'మందాడి'లో తాను మెయిన్ విలన్‌గా నటిస్తున్నట్లు సుహాస్ వెల్లడించారు. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' చూసి ఆ చిత్ర బృందం తనను సంప్రదించారని, ఆ సినిమాలో తన లుక్ చాలా డిఫరెంట్‌గా ఉంటుందని తెలిపారు.



## కొండగట్టు అంజన్నకు అర్జున్ సర్జా ప్రత్యేక పూజలు

తెలంగాణలోని ప్రముఖ హనుమాన్ ఆలయంలో హీరో అర్జున్ సర్జా ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టు అంజన్న ఆలయాన్ని తన కూతురు ఐశ్వర్య అర్జున్‌తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. తాను మొదటిసారి ఈ క్షేత్రానికి వచ్చానని అర్జున్ తెలిపారు. సీతాపయనం మూవీ రిలీజ్ తర్వాత కొండగట్టుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అర్జున్ సర్జా మాట్లాడుతూ.. 'ఆంజనేయస్వామి ఆలయానికి రావడం అంటే నాకు చాలా ఇష్టం. కొండగట్టు చాలా సార్లు విన్నా. అందుకే మొదటిసారి ఇక్కడికి వచ్చా. ఈ ఆలయానికి రావాలని చాలా రోజులుగా అనుకుంటున్నా. సీతాపయనం మూవీ రిలీజ్ సందర్భంగా కొండగట్టుకు రావడం చాలా ఆనందంగా ఉంది. అందరికీ మంచి జరగాలి. సర్వేజనా సుఖినోభవంతు' అని అన్నారు. కాగా.. అర్జున్ సర్జా దర్శకత్వం వహించిన లేటెస్ట్ మూవీ సీతాపయనం. ఈ చిత్రంలో ఆయన కూతురు ఐశ్వర్య అర్జున్ హీరోయన్‌గా మెప్పించింది. ఈ మూవీ ఇటీవలే వాలెంటైన్స్ డే సందర్భంగా థియేటర్లలో రిలీజైంది. ఈ చిత్రంలో అర్జున్ సర్జా కీలక పాత్రలో మెప్పించారు.

## చెక్‌బౌన్స్ కేసులో అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా క్లారిటీ



ఇప్పటికే చెక్‌బౌన్స్ కేసులో నటుడు రాజ్‌పాల్ యాదవ్ తిహార్ జైలులో ఉన్నాడు. అతడు బెయిల్ మీద జైలు నుంచి విడుదలయ్యేలోపే ఇప్పుడు మరో బాలీవుడ్ నటి వివాదంలో చిక్కుకుంది. ఒకప్పటి స్టార్ హీరోయిన్ అమీషా పటేల్‌పై చెక్ బౌన్స్ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. అయితే, ఈ అంశంపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా హీరోయిన్ క్లారిటీ ఇచ్చింది. 2017లో నవంబర్ 16న అమీషా పటేల్ మొరాదాబాద్‌లో ఒక పెళ్లి వేడుకలో డాన్స్ చేయాల్సింది. ఇందుకుగాను అడ్వాన్స్‌గా నిర్వాహకుడు పవన్ వర్మ ఆమెకు రూ.14.5 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. ఆమె కోసం హోటల్ రూం, ఫ్లైట్ టిక్కెట్స్ కూడా బుక్ చేశాడు. అయితే, ఆమె ఈవెంట్‌కు హాజరు కాలేదు. దీంతో నిర్వాహకుడు తనకు జరిగిన నష్టానికి తిరిగి డబ్బులు చెల్లించాల్సిందిగా అమీషాను కోరాడు. దీంతో మధ్యవర్తుల ద్వారా ఇరు పార్టీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఆమె అతడికి ఆ డబ్బు చెల్లించేందుకు అంగీకరించింది. మొదట రూ.10 లక్షలు నగదు రూపంలో చెల్లించింది. మిగతా రూ.4.5 లక్షలకు చెక్ ఇచ్చింది. కానీ, ఆ చెక్ బౌన్స్ కావడంతో నిర్వాహకుడు వర్మ తిరిగి అమీషాపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ అంశంలో ఇప్పటివరకు ఆమె కోర్టుకు హాజరుకాకపోవడంతో అమీషా పటేల్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీనిపై అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఇది చాలా కాలం నాటి కేసు అని ఆమె పేర్కొన్నారు. పవన్ తనపై చేస్తున్న తప్పుడు ఆరోపణల్ని ఎదుర్కొనేందుకు తన న్యాయవాదుల బృందం ప్రయత్నిస్తోందని క్లారిటీ ఇచ్చారు. తను ఈ అంశంలో నిర్వాహకుడికి పూర్తి డబ్బు చెల్లించినట్లు పేర్కొన్నారు. అయితే, ఎవరి వాదనలో నిజం ఉందో మరికొంతకాలం తర్వాత తేలుతుంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.